# ముందుమాట

ఎందరో మహానుభావులు, అందరికీ వందనములు అని త్యాగరాజ స్వామి వ్యక్తీకరించినట్లుగా నారాయణ స్వరూపులైన వారందరికి నా నమస్సుమాంజలులు.

జంతూనామ్ నరజన్మ దుర్లభం అను విషయము అందరికీ తెలిసినట్టిదే. విచక్షణాజ్ఞానము, వాక్కు మానవజన్మ సాఫల్యమునకు భగవంతుడిచ్చి వరములు. పురుషార్థములను సాధించుటకు మనకు ఈ శరీరమును యిచ్చిన తల్లిదండ్రుల ఋణము తీర్చుకొనుటకు ఒక జన్మచాలదు. ఈ విషయమును పెద్దల వలన తెలుసుకొని యుండుటవలన మాతల్లి, తండ్రి గారి ఛాయాచిత్రములను చిన్నవిగా తీయించి, వారు నిత్యపారాయణము చేయు ముఖ్యవిషయములను, వాటి వెనుక వ్రాయించి, లామినేషన్ చేయించుకొని అనునిత్యము వారి స్మరణము, స్పర్శ, అనుభూతిని పొందుటకు మా కుటుంబంలోని వారము వాటిని జేబులో వుంచుకొనుట జరిగినది.

ఈ ఛాయాచిత్రము చూచినవారు, వివరము అడుగుట, విషయము తెలుసుకొని సంతోషించుట జరుగుచున్నది. మాకు ఆప్తులైనవారికి, సహృదయులకు మేమే స్వయముగా ఈ ఛాయా చిత్రమును చూపించుట, వారి మన్ననలు లేక ఆశీస్సులు లేక సలహాలు పొందుట జరుగుచున్నది.

కొంతకాలం పిదప ఒకరోజు అద్దంకిలోని కోర్టు భవనమునకు నేను వెళ్ళుట జరిగినది. అక్కడ మా కుటుంబ శ్రేయోభిలాషులు, అత్యంత ఆప్తులు, లాయరు అయిన శ్రీ చిట్టాబత్తిన కనకసేనరావు గారికి ఈ ఛాయాచిత్రమును చూపుటజరిగినది. ఈ చిత్రమును తిలకించినంతనే వారి కళ్ళల్లో కాంతి మనసులో తెలియని ఆనందము కలిగినది. వెంటనే ప్రక్కనేయున్న కోర్టు గుమాస్తాగారితో మానాయనగారిని గూర్చి వారి జీవితములో నడిపిన ధార్మికగుణములు గూర్చియు, వారి జీవనశైలి గురించియు, మమ్ములను ఆ ధార్మికశక్తి యిప్పటికి ఎట్లు కాపాడుచున్నదియు, ఆయన ఒక ఋషిలాంటివాడనియూ, యిట్టివారు ఏ తరములోనో ఎప్పుడో కాని జన్మించరనియూ, యిది అది మా నాయనగారి అనేల జీవితమును గూర్చిన విశ్లేషణ అనర్గళముగా షుమారు ఒక అరగంటసేపు ఉద్ఘాటించినారు. పుత్రులమైన మేము గ్రహించలేని అనేక విషయములను ఆయన చెబుతుంటే మేము అనుకున్నదానికన్నా నాయన గారిని గూర్చి ప్రజలలో ఎంతటి ఔన్నత్యభావములు కలవో అర్థమైనది.

అంతట కనకసేనారావు గారు, తమ్ముడూ నీవు యింతటితో ఆగరాదు. మీ వంశములో ఎప్పడో ఒకప్పడు యింతటి ధార్మికుడు మళ్ళా పుడ్తాడు. రాబోవు తరాలకు మీ నాయనగారిని గూర్చిన సవివరమైన జ్ఞాపకాలను పుస్తకరూపకముగా వ్రాసి, వంశవృక్షముతోసహా నీవు ప్రింటు చేయించవలసియున్నది. అదియునుగాక ఆ పుస్తకము ఇంటర్‌నెట్ వెబ్‌సైట్‌లో పెట్టి ప్రపంచములోని ఏమూలన మైనంపాటివారు వున్నా వారికి ఈ ధర్మాత్ముని గూర్చ తెలియపర్చవలెను. ఈ విషయములు చూచిన వారిలో ఏ ఒక్కడైనా మా కుటుంబములో యింతటి ధార్మికుడున్నాడని సంతసించి, వారి ప్రవర్తన మార్చుకొన యత్నించవచ్చును అని ఒక ఉత్తర్వుగా చెప్పి కోర్టులోనికి వెళ్లినాడు.

నేను ఆయనకు నమస్కరించి యిది ఏదో భగవంతుని ఆజ్ఞవలెనున్నది. లేకున్న యింత ధారాళముగా ఒక వ్యక్తిని గూర్చి, కేవలం వారు రైతులవద్దనుండి సేకరించిన వివరములపై మాట్లాడి ఈ విధముగా చెప్పట ఆశ్చర్యముగాను, ఆనందముగాను వున్నది. ఈ వినూత్న అనుభవము గురించి మా సోదరవర్గము వారితో సంప్రదించితిని. వారునూ సంతోషముతో ఆ వివరములన్నియు సేకరించి నీవే ఈ పనిని పూర్తి చేయమని చెప్పిరి.

నేను కవినిగాను, యిదివరలో ఏవిధమైన పుస్తకములు వ్రాసినవాడను కాను. ఈ భారము నావల్ల అగునా? అని ఆలోచించుచుంటిని గాని నా ప్రయత్నము ముందుకు సాగలేదు. ఒక్క వాక్యమైననూ వ్రాయలేకపోతిని. ఏమి వ్రాయవలయును, ఎట్లు వ్రాయగలను, యిట్లు రెండు మాసములతో గడిచినవి. యింతలో నాకు రిటైర్మెంటు. నేను 30.6.2005వ తేదీన పదవీ విరమణ చేసియుంటిని. ఇక ఫర్వాలేదు. ఈ ప్రయత్నం చేయవచ్చు అనుకొంటిని. ఇంతలో మా దాయాది అయిన శ్రీ మైనంపాటి శ్రీహరినారాయణ తీర్థులుగారు నన్ను పిలిచి వారివద్ద అసంపూర్తిగావున్న వంశవృక్షమును పూర్తిచేయు భారము నాపైయుంచినారు.

వానప్రస్థ జీవితము కావలసినంత సమయము కలదు. వంశవృక్షముపని అగుచున్నది. కాని మా నాయనగారిని గురించిన కథనము ముందుకు సాగలేదు.

ఒకరోజు మధ్యాహ్నం భోజనం అనంతరం పడుకొనియుండగా ఒక చక్కటి ఆలోచన స్ఫురించినది. నాయనగారు నిత్యం గీతాపారయణము చేయుచుండెడివారు. వారి ఆచరణకూడా గీతయందలి ధార్మిక సూత్రములపైననే ఆధారపడియున్నది. కావున

గీతాపారాయణము చేయకుండా నాయన గారిని గూర్చిన రచన జరుగుట అసంభవమని తెలిసినది.

వెంటనే నేను గోరఖ్‌పూర్ వారి గీతాగ్రంధము (పెద్దది) చదువుట ప్రారంభించి రెండుమారులు అర్ధ తాత్పర్యములతోసహా పూర్తిఅయిన పిదప నేను కంటి ఆపరేషన్ కొరకై హైదరాబాద్ వెళ్ళవలసివచ్చింది. మరియు కొంతకాలము గడచినది.

ఒకరోజు మధ్యాహ్నం నా జ్ఞాపకాలను మతికొచ్చి కాగితాలను తీసుకొని ఆరంభించగా ఈచిన్న పొత్తము తయారు అయినది.

ఈ పుస్తకమును ఎందుకు వ్రాయవలసివచ్చిందో శ్రీ కనకసేనరావు గారు చెప్పియున్నారు. కావున పునరుక్తి అవసరంలేదు. దీని ఫలితమునుకూడా వారే సెలవచ్చియున్నారు. కాని దానితోపాటుగా ఈ రచన కారణమున మా పితృదేవతల స్మరణము ఎక్కువగా జరుగుటెక్కువ ఫలితము.

ఇట్టి రచన చేయమని ఆజ్ఞమాదిరిగా చెప్పిన శ్రీకనకసేనరావు గారికి నా ప్రత్యేక అభినందనలు. ఈ రచన నిర్వహించు బాధ్యతను నాపైమోపి ఈ మహద్భాగ్యమును నాకు కల్పించిన మా సోదరులకు నమస్కారములు.

ఈ రచనలో మైనంపాటి వారి వంశ చరిత్రను వారి రచననుండి తీసుకొనుటకు అంగీకరించిన రైల్వేకోడూరు వాస్తవ్యులు శ్రీ మైనంపాటి సుబ్రహ్మణ్యం గార్కి నా నమస్సుమాంజలులు.

దీనిని రచించుటకై విలువైన సమాచారము అందజేసిన మా అగ్రజులు శ్రీ మైనంపాటి వెంకట సుబ్బారావు గారికి నా దండవత్ప్రణామములు.

మా వంశవృక్షమును అందించిన మా బాబాయి గారైన శ్రీ హరినారాయణ తీర్ధుల గారికి నా వందనములు.

ఏదైనా ఒక పుస్తకం వ్రాయవలెనంటే ముందుగా ఆయన ఒక కవి అయివుండాలి. కాని నాకు ఆ అవకాశములేదు. నేను కేలవం ఉత్తర అద్దంకి గ్రామమునకు కరణంగా పనిచేసి (1968 ఫిబ్రవరి నుండ 1984 జనవరి వరకు) దరిమిలా 3 సంవత్సరముల పైకాలము ఖాళీగావుండి, తిరిగి కోర్టు ఉత్తర్వుల మేరకు దర్శిలో వి.ఏ.విలేజ్ అసిస్టెంటుగాను దరిమిలా తాళ్ళూరు మండల రెవిన్యూ అధికారి కార్యాలయములో జూనియర్

గుమాస్తాగా పనిచేసినాను.

రచనలకు సంబంధించిన అవగాహన లేదు. కాకపోతే ఎప్పడైనా ఒక పుస్తకం చదవడం తప్ప.

కాని శ్రీ కనకసేనరావు గారు మా నాయనగారిని గూర్చిన వివరాలు వ్రాయమన్నారు. ఆయన నోటివెంట ఆ పలుకులు ఎందుకువచ్చినవో, ఆ వివరాలు వ్రాయమని మా సోదరులు ఎందుకు అన్నారో, నేను ఈ పుస్తకమును వ్రాయుటకు ఎంత ప్రయత్నించినా నావల్ల కాలేదు.

కాని దీనిని వ్రాయుటకు ముందు నేను నిత్యము గీతాపారయణ చేయుట అలవడినది. మా నాయనగారి అలవాటును నేను పుణికిపుచ్చుకొనలేనందున భగవంతుడు ఈ రూపములో నాచే ఈ కార్యక్రమమును మొదలుపెట్టించినాడు. నేను యిదివరలో ఏ రచనా చేసియుండలేదు. కావున దీనిని మామూలు రచనా వ్యాసాంగములతో పోల్చుటకు వీలుండదు. కాకపోతే మా నాయనగారితో మా జ్ఞాపకాలను అక్షరబద్ధం చేస్తూపోతాను. విజ్ఞులు దయయుంచి తప్పలను పరిహరించెదరుగాక !

ముందుమాటలో చెప్పినట్లు మా నాయన గారిని గూర్చి చెప్పట అనగా భగవద్గీతను చెప్పినట్లే గీతను చదువుట మననము చేయుట, ప్రసంగములు చేయుట, అవధానములు చేయుట, ఎన్నియో మనము చూచుచున్నాము. కాని గీతను ఆచరించుట అనునది ఎంతయో క్లిష్టతరమైన కార్యము. అట్లుజేసిన మానవుడు మాధవునితో సమానము. అందుకే కనకసేనరావు గారి నోటివెంట యిట్టి పలుకులు వచ్చినవి. ఆ ప్రేరణయే ఈ చిన్న పుస్తకము. ఇది ఒక వ్యక్తియొక్క జీవనశైలి. కాని అందరికి ఆచరణీయమైన మహోన్నత ఆదర్శము.

ఇంతకు గీతలో ఏమి చెప్పారు? ఏమి ఆచరిస్తే గీతను ఆచరించినట్లు? అనునవి మనకు ముఖ్యమైన కథావస్తువు.

## మా ఊరు - మా బాల్యం

మా ఇల్లు ప్రకాశం జిల్లా అద్దంకి గ్రామం ఉత్తర అద్దంకిలోని అద్దంకివారి బజారులో వుండేది. అది ఒక పాత మట్టిమిద్దె. ఎదురెదురు దూలాలువేసి దక్షిణపువాకిలి, దక్షిణంవైపు బజారు. బజారువైపు ఖాళీస్థలం ఎక్కువ. తర్వాత దొడ్డి, ప్రహరి తర్వాత మళ్లీ

20 సెంట్ల స్థలం, ఆ స్థలందాటితే ప్రముఖ నాటక మరియు సినీనటుడు అద్దంకి శ్రీరామమూర్తిగారి స్థలం. ఆ స్థలం దాటిన ఊరిచెరువు. శ్రీరామమూర్తిగారు స్థలం అమ్ముకొనిపోయి విజయవాడలో స్థిరపడినారు. ఆ స్థలం పెద్దకరణంగా ప్రసిద్ధిగాంచిన అద్దంకి హనుమయ్యగారు కొన్నారు. ఆ స్థలంలో ఒకపెద్ద మర్రిచెట్టు వుండేది. విస్తారమైన చెట్టు. ఆ స్థలం ఆనుకొని తూర్పువైపుగా వారిల్లు, పెద్దమేడ.

మా చిన్నతనంలో అద్దంకివారి బజారులో అద్దంకి వారి యిండ్లు, మాయిండ్లు, ఎదురెదురుగా వుండేవి. మా ఇంటికి పడమరవైపు ఒక పాడుబడిన అద్దంకివారి ఇల్లు పెద్దస్థలం. మేము ఆడుకోవడానికి అనువుగా ఉండేది. ఆ యింటికి ఉత్తరంగా, మా దొడ్డిస్థలం ఆనుకొని అద్దంకి లక్ష్మీనరసయ్యగారిల్లు. మా ఇంటికి తూర్పువైపుగా మునెయ్యగారి స్థలం. అందులో తూర్పుగా వారి చిన్న మట్టి మిద్దె ఇల్లు. అందులోవారు వారి సోదరి మునెమ్మగారుండేవారు. వారి స్థలం ఎదురుగా అద్దంకి వారి యిండ్లకు తూర్పుగా మాగ్రామ పురోహితులు శ్రీ తాడిగడప పద్మనాభయ్య గారి యిల్లు. అందులో పద్మనాభయ్యగారు వారి భార్య మహలక్ష్మమ్మగారు వీరి కుమారుడు బ్రహ్మానందం, పద్మనాభయ్యగారి సోదరి పద్దమ్మగారు ఉండేవారు.

అద్దంకివారు మూడు లోగిళ్ళు మా ఇంటికి సరిగ్గా ఎదురుగ్గా వుండేవి. వారిది కంకరమిద్దె. మా ఇల్లుకూడా అద్దంకి వారిదే. మా మేనత్త అద్దంకి వెంకట నరసింహం గారి భార్య మహలక్ష్మమ్మ గారిది. మేము గుర్తెరిగే రోజులకే కొన్ని అద్దంకివారి కుటుంబాలు వలసవెళ్ళిపోయాయి. పాడుబడిన దొడ్లు ఎక్కడపట్టినా దర్శనం. పిల్లలు ఆడుకోవడానికి బాగా అనుకూలంగా వుండేది. విస్తారమైన లోగిళ్ళు వుండేవి కాబోలు ఆ స్థలములకు కట్టిన పాటిమట్టి ప్రహరీగోడలు కాలంతోపాటు సగం కరిగివుంటాయి. అవి ఎక్కి దూకడానికి బాగుండేవి.

పాటిమట్టి గట్టిదని ఆరోజులలో అందరు ఆ గోడలనే పెట్టేవారు. ప్రహరీగోడలన్నీ ఉప్పుఉరిసి క్రింద నుండి రాలుతూవుండేవి. సంక్రాంతి వస్తుందంటే ఒక నెలముందే హడావుడి. ఆ ఉప్పరిసిన గోడలు గీరి మట్టిపేడతో అలికి ముగ్గులు వరుసగా వేసి సిద్ధంచేసేవారు. ఆడవాళ్ళకి కావలసినంత చాకిరి. అయినా చిన్నా, పెద్దా తేడాలేకుండా అందరూ ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేసేవారు.

పూర్తిగా పల్లెటూరి వాతావరణం. అద్దంకి వారికి పూర్వం దేశపాండేల కుటుంబమని అంటారు. వారి జాయింటు కుటుంబములో 360 కుచ్చిళ్ల భూమి వివిధ గ్రామాలలో ఉండేదని, వీరందరు విడిబడగా కొన్ని తరాల తర్వాత కొందరు వారి భాగాలను అమ్ముకొనిపోగా మేము తెలుసుకొనేసరికి ఆ బజారులో కేవలం 6 కుటుంబాలవారు మాత్రమే ఉండేవారు.

మా యిల్లు కూడా అంటే మేముండే ఇల్లు కూడా ముందుచెప్పినట్లుగా అద్దంకివారి కుటుంబములోనిదే. అందువల్లనే పై విషయాలు చెప్పవలసివచ్చింది. మా మేనత్తగారిల్లు రెండుగా విభజింపబడి మధ్యలో ఒక పెద్ద తడిక అడ్డంగావుండేది. మధ్యనడవ రెండువైపులా పెద్ద అరుగులు. పడమరవైపు అరుగు నడవ మరియు తూర్పు అరుగులో 3 అడుగులు ఒక భాగం, మిగిలిన అరుగు నడవ 3 అడుగులు కలిపి ఒకభాగం. వాకిట్లో అడ్డంగా ఏమీలేదు. కాని హాలులో తడికె, వంటగదిలో గోడవుండేది. దొడ్లు, మధ్యప్రహరి దానికి ఒక తలుపు రెండిళ్లకు కలిపి ఒక బావి మాభాగంలో వుండేది.

అప్పటికి ఆ బావి త్రవ్వి, ఆ ఇల్లుకట్టి ఒక శతాబ్దం అయిందని చెబుతారు. బావిలోని నీరు మధురంగా వుండేది. కాని క్రొత్తవాళ్లకు వేడిజేస్తుందని చెబుతారు. దొడ్లో ఒక చింతచెట్టు, గన్నేరుచెట్టు, కస్తూరి తుమ్మచెట్టు, వాకిలి ఎదురుగా పెద్ద తులసికోట ఉండేది. ఆ తర్వాత ప్రహరీవుండేది. ప్రహరి అవతల స్థలంకూడా వీరిదే. ఆ మొత్తం స్థలమునకు వున్న ప్రహరి శిథిలమైపోగా బావికి దగ్గరలో వేరే ప్రహరీ పెట్టుకొని పశువులు రాకుండా ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఖాళీస్థలంనిండా పిప్పింటాకు, రైలుబొగ్గుచెట్లు, తుమ్మిపూలచెట్లు, పిచ్చిసుమచెట్లు, రామనానిచెట్టు, ఒకపెద్ద మునగచెట్టు, ఒక చిన్న తాటిచెట్టు, పచ్చగన్నేరుచెట్టు, 2 వేపచెట్లు వుండేవి.

ఎందుకు చెప్తున్నానంటే ఔషదులు అన్నీ దొడ్లోనే. చిక్కావి, జలుబు, దగ్గుచేస్తే కస్తూరితుమ్మ పేయడు కాల్చి బుగ్గున పెట్టుకుంటే తగ్గేది. పిల్లలం ఎప్పడు పడడంగాని, ఆటలలోగాని గాయాలైతే పిప్పింటాకు పసరువేస్తే వెంటనే తగ్గిపోయేది. ఈవిధంగా ఆ ఖాళీ స్థలమంతా ఆవరించివుంటే మధ్యలో నడవడానికి త్రోవలుగావుండేవి. ఇలాంటి దొడ్లు పాడుబడిన గోడలతో చీమచింతచెట్లు వుండేవి. పిల్లలందరూ సీజనులో దోటీలుకట్టి చీమచింతకాయలు కోసేవాళ్లం.

మా యింటికి పడమర ఆనుకొనివున్న స్థలం పాడుపడిన ఇల్లు ఆనుకొని పడమర వైపు ఒక చిన్న బజారు వుండేది. దానిని “దర్వాజా” అని పిలిచేవారు. అంటే అక్కడ ఒకపెద్ద దర్వాజా రోడ్డులోనే వుండేది. ఆ లోపల అన్నీ అద్దంకివారి ఇళ్ళు. దాని తర్వాత ఆచార్యులవారి ఇండ్లు. ఆ యిండ్లకు ఆనుకొని పడమరగా 13వ శతాబ్దంనాటి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉత్తరముఖంగా వుండేది. దర్వాజాలోని యిండ్లు పాడుపడిపోగా ఒక్క కుటుంబం మాత్రం అద్దంకి లక్ష్మీనరసింహం గారి యిల్లు వుండేది. వర్షాకాలంలో అన్నీ మొక్కలుండేవి. ఎండాకాలానికి ఆ చిన్నచెట్లు ఎండిపోతే కొన్ని పొయ్యిలో పెట్టుకునేవారు. పిల్లలకు ఆడుకోవడానికి కావలసినంత స్థలం.

శ్రీ నరసింహస్వామివారి గుడికి వెనుక ఖాళీస్థలం అందులో రావిచెట్లు వుండేవి. ఆస్థలం ఆనుకొని దక్షిణం పోలూరి హనుమయ్య గారిల్లు వుండేది. వారిల్లు దాటగానే బజారుకు దక్షిణంగా లక్కరాజు వారిళ్ళ కుటుంబాలు, బ్రాహ్మణుల ఇండ్లు వుండేవి. అక్కడే మా పంతులుగారు శ్రీ లక్కరాజు రామయ్య గారు ఉండేవారు. అక్కడ నుండి దక్షిణం తూర్పుగా పెరికపాలెం వుండేది. పడమర ఒక ఖాళీస్థలం, బజారు దాటితేనే “భవనాసి కాలువ” వుండేది. దానిగుండా వరిధాన్యం పండటానికి నీరు విడుదల అవుతుంది. ఆ కాలువ అద్దంకి ఉత్తరంగావున్న సింగరకొండ వద్దనున్న భవనాసి చెరువు వద్దనుండి 7 మైళ్ళ వరకు గోపాలపురం, ఉత్తర అద్దంకి, దక్షిణం అద్దంకి, కొంగపాడు, వేలమూరిపాడు గ్రామాలకు వరిసాగుకు నీరందించే కాలువ. కాలువ ఒడ్డున యిసుకతిన్నెలు వుండేవి. ఆ గాలి యిసుక అక్కడికి దగ్గరలో అంటే 3 ఫర్లాంగుల దూరంలో వుండే గుండ్లకమ్మ నది ఒడ్డునుండి గాలికివచ్చి ఇక్కడ ఆగుతుండేది.

ప్రభుత్వం వారు కాలువ పూడిపోతుంటే కాలువ ఒడ్డున ఒక సరిగతోపు వేయించారు. ఆ తోపు ఆనుకొని కాలువకు పడమరగా ఒక పెద్ద యిసుకదిన్నె 20 అడుగుల ఎత్తువుండేది. దానిమీదకు ఎక్కి పొర్లిగింతలు పెట్టడం పిల్లలకు పెద్ద ఆట. ఆ కాలువ ఒడ్డున వరగోగుచెట్లు 4 వుండేవి. అక్కడ మేమందరము కలిసి కోతికొమ్మచ్చి ఆడేవారము. యిసుకలో కబాడీ, మరియు కోకో ఆటలు ఆడేవారము. అంతా అయిపోయిన తర్వాత కాలవలో స్నానాలకు దిగి, కేరింతలతో స్నానాలు చేస్తూవుంటే ఆ ఆనందం మరలా వస్తుందా అని ఆలోచన వస్తుంది.

నా తీపిజ్ఞాపకాలలో ఉన్నంతవరకు మా బాల్యం ఎంతో ఆనందంగా గడిచిందని చెప్పవచ్చు. ఆ రోజులలో 5వ సంవత్సరంలో బడికి పంపేవారు. బడికి పంపడమంటే అక్షరాభ్యాసంచేసే యింటి వద్దకు బడిలోని పిల్లలందరినీ తీసుకొనివచ్చి వారికి పప్పుబెల్లాలుపెట్టి ఉన్నవారు పలకలు, బలపాలు పంచేవారు. మాఊళ్ళో రామయ్య పంతులు బడి అంటే చాలా పేరున్నబడి. మా బజారులో నేరుగా తూర్పుకువెళ్తే 1000 స్థంభాలగుడి, గుడికి ఎదురుగా దక్షిణంవైపు రామయ్యపంతులు బడి దగ్గరే. గంటకొడితే వినబడుతుంది.

రామయ్య పంతులు గారిని గూర్చి ఒక్కమాటలో చెప్పడం కష్టమే. నాకు తెలిసేటప్పటికి 35 సంవత్సరాలు వయస్సు కలిగిన వారందరూ ఆయనవద్ద చదువుకున్నవారే. ముతకపంచ, అరచేతులచొక్కా వేసుకొని తెలుపు, నలుపు కలబోసినట్లుండే సెద్దగడ్డం, యిక్కడ కేకవేస్తే 2 ఫర్లాంగులకుపైగా వినబడేగొంతు ఎత్తయిన నలుపు విగ్రహం, చూస్తేనే భయం కలిగేటట్లు ఉంటాడు.

చదువుచెప్పే విషయంలో ఆయన రాజీపడేదిలేదు. ఆయనది మేనేజ్‌మెంట్ స్కూలు కావడం వలన మిగిలిన ఉపాధ్యాయులకు కూడా ఆయనంటే గౌరవము, భయము, ఖచ్చితంగా, నిర్మొహమాటంగా టైము ప్రకారం స్కూలుకు వస్తాడు, రమ్మంటాడు. దానితోవారు కూడా జాగ్రత్తగా ఉండేవారు. రామయ్య పంతులు బడిలో 5వ క్లాసు చదివాడంటే జీవితంలో తనకు ఎదురైన వ్రాతపూర్వక సమస్యలకు ఎక్కడకు పోనవసరంలేదు.

ప్రతిరోజు ఉదయం బడి ముంగిట ఖాళీస్థలంలో జెండా దగ్గర అన్ని క్లాసులవారు కూర్చోవాలి. సరస్వతి ప్రార్థన రోజుకోసారి చెప్పిస్తారు. అట్లాగే ప్రతిరోజు గుణింతాలు కొన్ని చెప్పించి తర్వాత క్లాసులకు లైనులోపోయి కూర్చోవాలి. ఆ స్కూలులో పిల్లలు గోలచేసే సంఘటనలు చాలా తక్కువ.

2వ క్లాసులోకి రాగానే కృష్ణశతకం చెప్పేవారు. 3వ క్లాసులో రాగానే సుమతి శతకం చెప్పేవారు. 4వ క్లాసులో వేమనశతకం చెప్పేవారు. ప్రతిరోజు ఒక పద్యం చదవడం, వప్పచెప్పడం లాంటి పని యింటికి ఇచ్చేవారు.

రామయ్య పంతులు గారు 4వ క్లాసు చెప్పేవారు. 4వ క్లాసునుండి నోటిలెక్కలు చెప్పేటప్పుడు తప్పనిసరిగా ఏదోఒకరోజు ప్రతివారికి దెబ్బలు తప్పవు. క్లాసు

చెప్పేటప్పుడు ఆయననుచూస్తే భయముండదు. ఎందుకంటే ఆయన నెమ్మదిగా ఒకటికి 10సార్లు విసుగులేకుండా ఎంతటి మొద్దువారికైనా అర్థం అయ్యేటట్లు చెప్తారు. కొంచెం తెలివితేటలు గలవారికి ఆయన వద్ద చదివితే ఎంతో విజ్ఞానము చేకూరుతుంది.

4,5 క్లాసులవారికి ప్రతి మంగళవారం సాయంత్రం స్కూలు అయిపోగానే ఒక అరగంటసేపు లైబ్రరీ పుస్తకాలు తెచ్చి అందులోని చారిత్రాత్మక కథలను వినసొంపుగా చెప్పేవారు. ఆయన ప్రతి సంవత్సరం సాంస్కృతిక కార్యక్రమాలు స్కూలు తరపున ఏర్పాటుచేసెడివారు. ఒకనెలపాటు ప్రతిరోజు సాయంత్రం ఆడపిల్లలకు జడకోలాటం నేర్పేవారు. అలాగే సంక్రాంతి నెలముందుగా మగపిల్లలకు కోలాటం నేర్పేవారు. యివిలేని సమయంలో ఆటల పోటీలుండేవి. యివిగాక స్కూలు ఆవరణలో చెట్లుపెంచే ఏర్పాట్లు పిల్లలచేత చేయించేవారు. అందులో కొందరిని తోటల మంత్రిగా నియమించి వారి ఆధ్వర్యములో పూలమొక్కలు వేయించేవారు. నేనుకూడా ఒక దఫా తోటల మంత్రిగా చేశాను. కాశీరత్నం పూలచెట్లుపెంచి వేలంపాట వేయించాము.

పాఠాలు చెప్పేటప్పుడు కొన్ని నీతిసూత్రాలు చెప్పేవారు. దానికి ప్రతిగా పిల్లలను డైరీ వ్రాయమనేవారు. మీరు చేసిన మంచిపనులను దానిలో వ్రాయమనేవారు. త్రోవలో గాజుపెంకులు, ముళ్ళువుంటే తీసివేసి మేము పేపరులో వ్రాసి ఆయనకు చూపించేవాళ్ళం. వానికి ఆయన సంతోషపడేవారు.

మేము చదివేటప్పడు శ్రీ రామయ్యపంతులుగారు కాక శ్రీ చంద్రపాటి సుబ్బారావుగారు శ్రీ వేములూరి సత్యనారాయణ గారు, శ్రీ లక్కరాజు నరసింహదాసు గార్లు ఉపాధ్యాయులుగా ఉండేవారు. అందులో నరసింహదాసుగారు హెడ్‌మాస్టర్‌గా 5వ క్లాసు చెప్పేవారు. ఈయన రామయ్య పంతులుగారి అన్న కుమారుడే.

వీరందరూ పిల్లలకు విద్యనేర్పడంలో తమ శక్తివంచనలేకుండా, నిరాపేక్షయా పాటుపడేవారు. రామయ్యపంతులు గార్కి ఒక ఆవు వుండేది. సొంత వ్యవసాయం ఉంది. ఆయన ఉదయాన్నే పశువులకొష్టంపోయి శుభ్రంచేసి, గుండ్లకమ్మకుపోయి మా నాయనగారితోపాటుగా స్నానాదికాలు పూర్తిచేసుకొని బిందెతో మంచినీళ్ళు తీసుకొని యింటికివచ్చి స్కూలుకు బయటుదేరేవారు. ఈ సమయానికి యింటివద్ద ఎవరైనా పిల్లలు కనబడితే దూరంనుంచే ఏమండీ దొరగారు యింకా బడికి పోవడానికి తీరలేదా? అని

ఒక కేకపెట్టేవారు. ఆ కేకకి రెండు, మూడు పాలెములలో (పెరికపాలెం, బలిజపాలెం, సాహెబ్‌లపాలెం) వున్న మిగిలిన పిల్లలు ఒకటే పరుగున స్కూలుకు చేరేవారు. స్కూలు జెండా వద్ద అందరికి కలిసి అటెండెన్స్ తీసుకొని, జెండాగీతం చెప్పించి ఎవరి క్లాసులకు వారు వెళ్ళేవారు. తర్వాత స్కూలుకురాని పిల్లలకోసం సైకిలు వేసుకొని ఊరిమీద పడేవారు. వాళ్ళింటికి వెళ్ళగానే పిల్లవాడు అక్కడుంటే ఎందుకు రాలేదని అడిగేవాడు. మా అయ్య గొడ్లకాడికి పంపుతానన్నాడు అని చెప్తే వెంటనే ఆ తండ్రికి చెంపమీద ఒకటిచ్చేవాడు. గాడిద! పిల్లవాడికి చదువులేకుండా చేస్తావుట్రా! ఏం నీవేం గాడిదలు కాస్తున్నా? అని పిల్లవాడిని తల్లిదండ్రులను స్వతంత్రముగా మందలించి పిల్లలను బడికి తీసుకొచ్చి చదువు చెప్పేవాడు. అట్లా చదువుకొన్నవారిలో ఎందరో పిల్లలు చాలా అభివృద్ధిలోకి వచ్చినవారున్నారు.

యింకా దసరా అంటే నిజంగా సరదానే. ముందురోజులలోనే దసరా పద్యాలు చదవడానికి ఒక బ్యాచ్‌ని తయారుచేసి వాళ్ళకు పద్యాలు నేర్పేవాడు. దసరా మొదలుకాగానే ముందుగా బడికి దగ్గరలోవున్న వినాయకుని గుడికి, ఎదురుగావున్న 1000 స్థంభాలగుడికి, కాకానివారిపాలెంలోని శ్రీరంగనాధునిగుడికి, రామాలయం, ఆంజనేయస్వామి గుడి చూచుకొని ముందుగా మా మునసబుగారింటికి, తర్వాత కరణంగారింటికి (మాయింటికే) ఆ తర్వాత వరుసగా పిలిచిన వాళ్ళ యిండ్లకు రోజుకు 7,8 యిండ్లకుపైగా పోయివచ్చేవారం.

దసరా పద్యాలలో ప్రతి గుడివద్ద ఒక్కొక్కపద్యం వేరే వేరేగా వుండేది. అట్లాగే మునసబుగారింటికి వేరే, కరణంగారింటికి వేరే, నియోగ బ్రాహ్మణులకు వేరే, పురోహితులకు వేరే, కమ్మవారికి వేరే, సాలీలకు వేరే, వైశ్యులకు వేరే, యిట్లా కులాల వారీగా దసరా పద్యాలు వుండేవి. అవి వారివారి యిండ్ల దగ్గర చదివితే వారు మరమరాలు, వేయించిన శనగపప్పు, అందులో బెల్లం కలిపి యిచ్చేవారు. ఆ పప్పుబెల్లాలు మాకు, ఆయనకు 2 రూపాయలు నుండి 5 రూపాయల వరకు యిస్తూవుండేవారు. ఆయన ఎన్నో సంవత్సరాలు గడచినా ఆ మొత్తమును పెంచలేదు. ఒకవేళ రైతులుగాని ఎవరైనా రోజులు మారాయి అని ఎక్కువయిస్తే తిరిగియిచ్చి ఆయన మొదట మామూలు తీసుకొనేవాడు.

ప్రకాశం జిల్లా అద్దంకి గ్రామం మేమున్న యిల్లు. మా మేనత్తగారి యిల్లు. వారిది పెద్ద కుటుంబము వారికి రెండుగాండ్ల వ్యవసాయముండెడిదట. ఎంతో పొలమును కలిగియుండి క్రమముగా క్షీణించిన కుటుంబములలోనిది అద్దంకి వారి కుటుంబము.

వీరు జమీందారీ కుటుంబపు వారసులు. మొత్తం నాకు తెలిసినప్పటికి 360 కుచ్చళ్ళ భూమిలో షుమారు 20 ఎకరముల పొలము కొంత అద్దంకిలోను కొంత యితర గ్రామాలలోను వున్నట్లు తెలుసును. మానాన్న గారు వెంకట నరసింహం గారు మొదట మైనంపాడులో ఉండి వారి విద్యాభ్యాసము పిఫ్త్ ఫారం వరకు చదువు అయిన తర్వాత వీరికి వివాహము జరుగగా వారి తమ్ముల చదువుల నిమిత్తం ఒంగోలులోనే కాపురం వుండెడివారు. వీరు కాపురంవున్న యిల్లు కొత్తపేటలోని జమ్మిచెట్టు వీధిలోని చివుకుల సోమయ్య గారిల్లు. తర్వాత కొంతకాలము అద్దంకి బుచ్చయ్య గారిల్లు.

ఒంగోలులో వీరు మొదటిసారిగా శిఖరం కోటేశ్వరగుప్త, ప్లీడరు గారి వద్ద గుమస్తాగా చేరినారు. తరువాత కొంత కాలము గొల్లపూడి సదాశివశాస్త్రిగ్రారి వద్ద ప్లీడరు గుమస్తాగా చేరినారు. వీరితోపాటుగా యిలీంద్ర వీరయ్య గారు సహగుమస్తాగా వుండేవారు. వీరు అప్పటికే కరణం మునసబులు పరీక్షలను పాస్ అయివున్నారు. ఒంగోలులో తనకున్న దానితో తృప్తిపడుచూ కాపురం కొనసాగుతుండగా వీరికి యిద్దరు సంతానము కలిగినారు.

1) మైనంపాటి వెంకట సుబ్బారావు గారు - మా పెద్దన్నయ్య

2) శ్రీరంగ రాజ్యలక్ష్మమ్మ గారు - మా అక్కయ్య

మా అమ్మగారిది ఒంగోలు ప్రక్కనేవున్న త్రోవగుంట. మా మాతామహులు చిల్లర వెంకట సుబ్బరామయ్యగారు, మాతామహి రామసీతమ్మ గారు. వీరికి 1) చిల్లర రంగారావు 2) సుబ్బారావు 3) హనుమంతరావు 4) కామేశ్వరరావు 5) చంద్రమౌళీశ్వరరావు మగ సంతానము.

మా అమ్మ వీరికి 4వ సంతానము. ఒక్కతే ఆడపిల్ల ఒంగోలు కాపురం సజావుగా జరుగుచున్నది. ఈమె మరుదులకు మరియు అద్దంకి రామారావుకి వంటచేసిపెడ్తూ గృహిణి కార్యక్రమములు సక్రమముగా నిర్వర్తిస్తూ వున్నది. ఆ సమయంలో అద్దంకి కరణం గారైన అద్దంకి హనుమయ్యగారు వయోవృద్ధులుగా వున్నారు. అద్దంకి 16000 ఎకరాలు కలిగిన పెద్ద గ్రామము. వీరు హెడ్ కరణంగా వున్నారు. వీరి కుమారులు 1) వెంకట చలపతిరావు 2) శేషగిరిరావు (మేజరు జనరల్) 3) వెంకటరావు (తహశీల్దారు), 4) లక్ష్మీనారాయణ, వేటపాలెం మున్సిపాలిటీలో పనిచేయుచు స్థిరపడియున్నారు. వీరిది పెద్ద కుటుంబము. హనుమయ్య గారి అన్నగారు దివాన్ బహుద్దర్ అద్దంకి వెంకట రామయ్య

గారు. వీరు జిల్లా జడ్జిగా చేసి రిటైర్ అయివున్నారు. వీరిని నేను కూడా చూచియున్నాను. వీరు 98 సం॥లు జీవించియున్నారు. వీరి కుమార్డు కృష్ణారావు గారు కూడా జిల్లా జడ్జిగా చేసి రిటైర్ అయినారు. వీరు తండ్రి కుమారులు యిరువురూ కలిసి పెన్షన్ తీసుకొనియున్నారు. అంటే తండ్రితోపాటు కుమారుడు అదే ఉద్యోగముచేసి పెన్షన్ తీసుకొనుట జరిగినది. ఈ విషయమై ఆ రోజులలో గొప్పగా చెప్పచుండెడివారు. వీరి కుమారులు కూడా ఉన్నత పదవులలోవున్న కారణంగా హనుమయ్య గారి వారసుడుగా కరణంగా చేయువ్యక్తి కొరకు అన్వేషణ జరిగినది. హనుమయ్య గారు కరణముగా చేసినపుడు రీసెటిల్మెంటు కూడా జరిగినది. ఆయన ఎంతయో ఉన్నతమైన పేరు తెచ్చుకొనియున్నారు.

ఆపేరు నిలబెట్టు మనిషి కొరకు అంతటి వ్యక్తి కోసము వెదుకనారంభించినారు. హనుమయ్య గారి భార్య కామమ్మగారు మా అమ్మమ్మగారికి స్వయాన అక్క. కావమ్మగారు తన అక్కగారి అల్లుడు ఒంగోలులోనే ప్లీడరు గుమస్తాగా వున్నడని, ఆయన యోగ్యుడని ఆయన శాంతస్వభావుడని తనను కనక అద్దంకి పిలిపించి వారి ఉద్యోగ వారసునిగా చేస్తే ఆ కరణం విలువలను కాపాడి ప్రజలకు మంచిసేవ చేయగలరని విశ్వసించి భర్తకు చెప్పినది. హనుమయ్యగారు వెంటకరామయ్యగారు మా నాన్నగారి పెద్దలతో సంప్రదించి వారిని అద్దంకి కరిణీకములో ప్రవేశపెట్టినారు. అది 1939లో జరిగినది.

అద్దంకి నుండి మా నాయన, అమ్మగార్లు యిరువురు సంతానముతో అద్దంకి చేరినారు. అక్కడ వుండటానికి ప్రస్తుతము యిబ్బంది లేకుండా మా న్నాన్నగారి తర్వాత తోబుట్టువు అయిన అద్దంకి మహలక్ష్మమ్మ గారిల్లు వున్నది. అది మా నాయనమ్మ గారికి పుట్టిల్లు. మా నాన్నగారు ఆడపడుచు యింట ఎందుకువుండాలి అని సందేహపడుచుండగా ఆమె మాత్రము తాను అప్పటికే భర్త మరణించినందున ఒంటరిగానున్న కారణముగా వీరిని సంతోషముగా తనవద్ద ఉండమని కోరినది. కాని నాన్నగారు ఆ యింటిలోనే తాను వేరుగావుండి కొనసాగవలెనని సంకల్పించి ఆడపడుచుకు యిబ్బంది కలగకుండా ప్రక్కనే ఒక యిల్లు ఏర్పరచుకొని, కాపురమును అందువుంచి కొనసాగించినారు.

హనుమయ్య గారి ఆశలకు మించి, వెంకటరామయ్య గారి ఆశీర్వచనములతో మా నాన్నగారు కరణము ఉద్యోగమును సర్వజన మనోరంజకముగా ఒక భగవత్త్వైంకర్య, భాగవత సేవగా అందరి మన్ననలను పొందునట్లుగా, ఆ తాలూకాలోనే కాదు ఆ జిల్లాయేకాదు ఎక్కడైనా యిట్లాంటి కరణం యిక ఎప్పటికీ మనకు చిక్కడు అను విధముగా ఉద్యోగమును నిర్వహించియున్నారు. దీనికై వారు వేసే ప్రతి అడుగు చాలా భావ గంభీరముగా, ఎంతో ఉదాత్తముగా భగవత్ప్రసాదితయై పెద్దల ఆశీస్సులతో లభించిన ఆ వృత్తినే దైవముగా భావించి, తాను వృత్తిలో మమేకమై తాను చేయు ప్రతి పనిని భగవదేచ్ఛగా భావించి, అందరికీ తలలో నాల్కవలె సునిసితమైన దృష్టికలిగి ఎవ్వరిచేతను మాటపడక ఎవ్వరినీ మాట అనక కరిణీకము యీలాగున చేయవచ్చునా! అని తన సహచరులకు ఆశ్చర్యము కలిగించు రీతిలో వీరి ఉద్యోగపర్వమును కొనసాగించి, ఆ వృత్తిలోనే తన 56వ యేట 1961 జనవరి 6వ తేది రథసప్తమి దినాన సూర్యతేజస్సులో కలిసినారు.

వీరి ప్రవర్తన ఒక వేదసారము. వీరి మనుగడ ఒక ఉపనిద్వాక్యము. వీరి కృత్యములు గీతసారములు. వీరి మాటలు పురాణేతిహాసము. వీరి హావభావములు శాంత గంభీరము. వీరు దబ్బపండు రంగులోవుండి ఎర్రని శ్రీ చూర్ణమును నుదుట ధరించి తెల్లని పంచ కోరాగుడ్డ చొక్క (పూర్తి చేతులతో) వేసుకొని, ఖద్దరు పంచ మామూలుగా అయితే భుజమున పొలము వెళితే తుండుగుడ్డగా చుట్టుకొని మెడకొంచెము వరగపెట్టి త్రోవనపోతూవుంటే దారిలో ఎదురొచ్చినవాళ్ళు రెండుచేతులు ఎత్తి మ్రొక్కనివారు ఆ రోజులలో ఎవ్వరూలేరు. ఆ సమయములో ఆయన విశిష్ఠ ప్రకృతిని గూర్చి తెలుసుకొన్నవారు ఆయన నడుస్తున్న భగవద్గీతా! సంపూర్ణ మానవుడా గాయిత్రి తపస్సు భగవద్గీత కవచము, దాశరథీ శతకమంత్రము వర్చస్సు నృశింహ తేజము కలిపి రాసిపోసినట్లున్న (ఆ వ్యక్తి పరమాత్మ స్వరూపునిగా నేడు తెలుసుకొన్నాము).

ఆ వ్యక్తి ప్రక్కగా జరిగెడివారు. ఆయన వీటికి ఉదాసీనుడు, ఎవ్వరున్నది, లేనిది ఆయనకు సంబంధము లేదు. ఏరోజు ఆయన దైనందిక కార్యక్రమములు ఆపకుండా తన జీవిత పర్యంతము కొనసాగించిన గంభీరుడు.

కరణార్ద్ర హృదయముతో పేదలయిన వారికి యింటిస్థలములు కేటాయించి ఎన్నో దీపములు అద్దంకిలో వెలుగుటకు కారణమైన సౌజన్యమూర్తి.

వచ్చిన వారికి లేదనకుండా యితోధికముగా సహాయము చేసిన దయార్ధమూర్తి.

ఎన్నియో ఆటంకములు, అవరోధములు, బాధలు, యిబ్బందులు, కక్షలు, కార్పణ్యములు, ఆయనకు ఎదురొచ్చినవి, కాని ఆయన తన కక్ష్యను వీడి యివతలకు రాలేదు. వాటిని చూచి బెదరలేదు చెదరలేదు. తన సహజ గంభీరతను కోల్పోలేదు. సామాన్య మానవునివలె శోకింపలేదు. ఎదుటివారిని అగౌరవపర్చలేదు. తన ధీరత్వమును తగ్గించలేదు. శాంతమును వీడలేదు. దానినికూడా భగవత్కైంకర్యమువలె అతి సామాన్యమైన దానినిగా తనదైన సాత్వికశాంత స్వభావముతోనే ఎదుర్కొన్న మహామనీషి. అందుకే నడుస్తున్న భగవద్గీత స్వరూపము.

ఆయన అద్దంకిలో తన పినమామగారైన అద్దంకి హనుమయ్యగారి నుండి కరిణీకము తీసుకొన్న తర్వాత, హనుమయ్య గారి అన్నగారైన దివాన్ బహదూర్ వెంకటరామయ్య గారు ఒకరోజు వీరినిపిల్చి తనవద్దవున్న భగవద్గీత పుస్తకమును యిచ్చి దీనిని నీవు నిత్యము పఠింపుము, దీనివలన నీకు మేలు జరుగునని చెప్పినాడు. తదాది ఆయన ఆ పుస్తకమును వీడకుండా మధ్యాహ్నసమయమందు మధ్యాహ్నికము కాగానే గీతాపారయణము ప్రతిరోజు ఒక అధ్యాయమునకు తగ్గకుండా చదివి తర్వాత భోజనము చేసెడివారు.

గీతాపారాయణమును చాలామంది చేసివుండవచ్చు కాని ఆ ప్రకారమే ఆచరణచేసి నిరూపించిన మహానుభావులు చాలా కొద్దిమంది మాత్రమేనని గీతాచార్యుడు చెప్పియున్నాడు. "మనుష్యాణాం సహస్రేషు అని వాసుదేవస్సర్వమితిస్సమహాత్మాసుదుర్లభః".

అట్టి మహాత్ములలో వీరు ఒకరని చెప్పటకు సందేహము యిసుమంతైననూ లేదు. వీరు గీతాసారమును వంటపట్టించుకొని సమముగా సర్వజీవులను దర్శించుటకు (పండితాఃస్సమదర్శినః) అలవాటు పడినారు.

ఆ ప్రకారమే తన జీవితమును గడపిరి. ఈ విషయము వారి ప్రవర్తనద్వారా లోకవిదితము.

ఈయన సర్వజీవులను స్వయముగా భగవత్స్వరూపులుగా దర్శించెడివారు. హింసఅనునది వీరికి గిట్టేదికాదు. పశువులను ఎవరైనా త్రోవలో వెళ్ళేటప్పడు కొడ్తుంటే వారిని, తాను నిలబడి వారించి వెళ్ళేవారు. ఇంటిలోపలికి వెళ్ళు కుక్కలను కర్రతో కొట్టనిచ్చేవారు కాదు. పాపం అదికూడా జీవుడేకదా దాని ఆకలిదానిది అని వారించేవారు. అప్పటిలో మేము పిల్లల మనస్తత్వంలోవుండేవాళ్ళం కనుక ఆ భావములోని అంతర్యం అర్థమయ్యేది కాదు.

పేదవారెవరైనా తనవద్దకు సహాయమునకు వస్తే ఆపని వెంటనే పూర్తిచేసేవారు. ఆ వచ్చిన వ్యక్తి తృణమో ఫణమో యివ్వడానికి ముందుకు వంగేవాడు. అది గమనించి నాన్నగారు మీకు ఎంతమంది పిల్లలు అనేవారు. ఆ వ్యక్తి సంఖ్యచెప్పేవాడు. ఆ సంఖ్య నలుగురు దాటితే నీవు ఏమీ ఇవ్వనవసరంలేదు. నీ పిల్లలకు ఏదైనా తీసుకొనిపో అని నిరాకరించేవారు. ఇదిచూసి ఇంటిలోని వారికి ఏమనాలో పాలుపోయేది కాదు. తన యింటిలో యింతవరకూ పొయ్యిలో పిల్లి లేవలేదు. ఆ వచ్చిన వ్యక్తి తన సంతోషపూర్వకంగా ఇచ్చిననూ ఈయన కాదంటున్నాడే. ఈ పూట జరుగుబాటు ఎట్లాగా అని విస్తుపోయేవారు. మా అమ్మగారైతే వాకిలి లోపల కూర్చొని బాధపడుతూ వుండేది. కాని ఆయన కార్యాలయంలో పనిచేసుకొను సమయంలో పంచవైపు రావడానికి సాహసించేదికాదు. ఎదురుగావున్న ముగ్గురు నౌకర్లు నిశ్చేష్టులై అక్కడేవుండేవారు.

ఆ సమయము చాలా క్లిష్టమైన పరిస్థితి. సామాన్యమైన మానవుడు ఆపని చేయలేరు. భగవత్పరిష్వంగములో నిత్యము ఓలలాడు మహానుభావునికి తప్ప ఆ నిరాకరణ కుదరదు. కారణము...

అప్పటి సమయము 11.30 గంటలు దాటినది. పొయ్యి మీదకు యింటిలో గింజలేదు. ఒంటిగంటకల్లా స్కూలుకు పోయినవారు అన్నముకొరకు వస్తారు. అప్పటికే రామయ్య పంతులు బడినుండి యింటికి వచ్చిన పసిపిల్లలిద్దరికి అమ్మ చెరివొక గెనుసుగడ్డ యిచ్చి హోమ్‌వర్క్ చేసుకొనమని చెప్పింది. ఆమె మడిబట్ట మడతపెట్టుకొని బిందెతో సహా గడపలోపల కూర్చొంది. ఎవరైనా వచ్చి ఏదైనా యిస్తే లేక యిస్తామంటే కోటప్ప (నౌకరే కాని ఇంటికి పెద్ద కుమారునితో సమానము) బజారుకు వెళ్తె ఈమె స్నానాదికముల పూర్తికావించి ఎసరు పెడ్తుంది. ఆ సరుకులు రాగానే బియ్యంచేసి ఎసట్లో పొయ్యాలి.

బియ్యం చేయకుండా పోసేరోజులు కావవి. చాలా సునిశితమైన సమస్య సమయం చాలదు. ఈ ఆలోచనలు ముప్పిరిగొనగా ఆమెచేసేదిలేక స్త్రీ సమ్మతముగా "కోటప్పా టైము ఎంత అయిందిరా?" అంటుంది లోపలనుంచి. అంటే బియ్యం తేవడానికి సమయం మించినది అని సూచన.

ఇది గమనిస్తాడు కోటప్ప. అందుకే అతడిని మా యింటికి పెద్దకుమారుడితో సమానమన్నది. అమ్మగారూ 12 అయింది అంటాడు. ఈ సంభాషణవిన్న నాన్నగారు తలపైకెత్తి సాచిచూచ నీమొహం 12 కాలేదులేరా అంటాడు. అయింది అయ్యగారూ! నవ్వుతూ అంటాడు కోటప్ప. గడియారాలు లేవుకదా యింట్లో. అంతట సామాన్యమైన మనస్సుగల మానవుడు అయితే ఏదోరకముగా ఆతృతపడి యింటిలోని సరుకులకై ప్రయత్నించుట, సమాలోచనలు చేయుట జరుగుతాయి. కాని ఆయన మహామనీషి. రూపుదాల్చిన భగవద్గీత.

సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం

శరణం వ్రజ

అహంత్వాసర్వపాపేభ్యోమోక్ష

యిక్ష్యామిమాశుచః ॥

అననానశ్చిం తం యంతోమామ్

యేజనా; పర్యుపాసతే

తేషాం నిత్యాభియుక్తానాం

యోగక్షేమం వహామ్యహం

ఆయన అన్ని ధర్మములను వాసుదేవునియందు విడచిన మహానుభావుడు. అప్పడు నాయనగారు లేచి నేలపై ఒక గీతగీచి కోటప్పను ఆ గీత అంచున నిలబెట్టి చెవులో వ్రేళ్ళు పెట్టుకోమంటారు. ఆ తర్వాత చెవుల దగ్గర గీత గీస్తాడు. పాదముల గీతనుండి, చెవుల గీతవరకు పాదములచేత లెక్కవేయిస్తాడు.

పాదముల సంఖ్యనుబట్టి ఒక గణితమున్నది. 11 పాదచ్ఛాయ సంఖ్య పరుగున వెళ్ళింది.

ఆ గణితమువేసి దాని ప్రకారము యిప్పుడు సమయము గం.11-20 ని.లు అనో గం.11-40 ని.లు అనో తేల్చి చెబుతాడు.

ఈలెఖ్ఖ పూర్తిఅయినా యింట్లో బియ్యం సంగతి విచారణకు రాలేదు. యింకా ఒకగంటలో 11 కంచాలు యింట్లో తేవలసియున్ననూ తన వైఖరిలోగాని, స్థితిలోగాని ఎలాంటి వికారములేక మరలా పోయి తన సీటులో కూర్చొని లెక్కవ్రాస్తూ వుంటాడు.

మరలా పది నిమిషములు ఆగి కోటప్ప అయ్యా బజారుకు వెళ్ళాలిగదయ్యా అంటాడు. అప్పడు ఆయన తలపైకెత్తి బట్టతలపైన మునివేళ్ళతో గీచి 'వాడే పంపిస్తాడులే' అంటాడు. దాని తర్వాత తలదించి వ్రాసుకుంటూ వుంటాడు. ఆ తర్వాత ఆయనతో మాట కలపడానికి ఎవ్వరికీ సాహసము లేదు. అది ఒక మూర్తీభవించిన సముద్ర గాంభీర్యము. మనసులో ఆవాసు దేవుని, చేతులలో పెన్ను గీస్తున్న అక్షరములు, లెక్కలు, లెక్కలలో మునిగిన ఆ గంభీరతను కదిలించే శక్తి అక్కడ ఎవ్వరికీ లేదు.

కానీ ఆయన తలపెకెత్తి 'వాడే పంపుతాడులే' అన్న భావ గంభీరతకు ఆ క్షణమై పరమేశ్వరుడు తాను వశుడై ఆయన యోగక్షేమములు ఎవరికోసం తీసుకొంటాడు. తప్పనిసరిగా ఆయన ఏదోఒక జీవాత్మలో ఒక ఆలోచన కలిగించి పంపిస్తాడు. ఆ వచ్చినవ్యక్తి తనకు కావలసిన పనిని చెప్పగానే ఆ పనిని పూర్తిచేసి యిస్తాడు. తాను వస్తూనే కరణం గారింటి విషయం తెలుసు కాబట్టి అందుకు సిద్ధమై వస్తారు చాలామటుకు. కొందరు తమవద్ద లేక పని తొందరనుబట్టి వస్తారు. అప్పడు వారే స్వామి నావద్ద డబ్బులు లేవు, కోర్టులో ఇప్పిస్తామంటారు. ఆయన దీని విషయమై పట్టించుకోడు. విిననట్లువుండడు. తన ధ్యానంలోకి వెళ్ళి వ్రాస్తూవుంటారు.

ఆ వచ్చిన వ్యక్తి కోటప్పను తీసుకొనివెళ్ళి ఆ పూటకు కావలసిన బియ్యం, చింతపండు, మిర్చి వగైరా యిప్పిస్తాడు. కోటప్ప బజారుకు వెళ్తే మా అమ్మగారు బావివద్దకు స్నానానికి వెళ్ళివచ్చి వాళ్ళు బజారునుండి వచ్చేటప్పటికి ఎసరుకాగబెడ్తుంది. బియ్యం రాగానే ఎసట్లోపోసి వేడిగా అన్నంవండి పిల్లలు వచ్చేటప్పటికి ఏదోఒక పచ్చడి లేక పులుసు వగైరాలతో భోజనం సిద్ధంచేస్తుంది.

ఇది నిత్యకృత్యము. ఏదో ఒకరోజు జరిగిన సంఘటన కాదు. సంవత్సరములో

సగం రోజులకుపైగా యిదే తతంగం జరుగుతుంది. భక్తుని పరీక్షించుటలో నారాయణమూర్తికున్న విశృంఖలత్వం తెలియనిదికాదు. కాని దానిని ఏమాత్రం ఆలోచనలోనికి తీసుకోకుండా తనధీరత్వాన్ని కోల్పోకుండా నిలబడతాడు సరియైన భక్తుడు. ఆ కోవలోనికి చెందినవారే వీరు.

వీరు ఎదుర్కొన్న పరీక్షలు చాలాకలవు. అవియన్నియు దినచర్యవలె రోజూ జరుగుతూవుండే అన్నపానాదుల విషయమే ఎక్కువ. రోజువారీ ఖర్చులకు సక్రమంగావుంటే యింతటి భక్తుడు తనను మరిస్తే తను మళ్ళా యింకొకరిని వెతుక్కోవద్దూ! అసలే "మనుష్యాణాం సహస్రేషు" అని ఆయనకి తెలుసుకదా. ఉన్నవాణ్ణి వదులుకుంటే తను మళ్ళా తిప్పలు పడుట నారాయణమూర్తికి యిష్టమా! అందుకే వున్నవారికే కష్టాలుపెట్టి తన స్మరణ చేయించుకుంటే ఒక పని అవుతుంది కదా?

అందుకే అనుకుంటా ఆయన జీవితాంతము మరుసటిరోజుకి యింటిలో నిల్వలేకుండా చేసి నిత్యము ఆయన ధ్యానాదులకు ఆటంకము కల్పించేందుకు పరీక్షపెట్టి ఆ పరీక్షలో తన భక్తుడే గెలిచేంత స్థిరబుద్ధిని ఆయనకు ప్రసాదించి తన భక్తుడు నెగ్గేడు అని ఆయన సంతోషపడిన భగవంతుని ఋణము ఎలా తీర్చుకోగలము?

మేము ఎంతో పుణ్యవశముచేతనే ఆ దంపతుల అన్యోన్యత ఫలితముగా వారి సంతానముగా జన్మించితిమి.

గాయత్రి మంత్రము, భగవద్గీత పారాయణము, రామనామ లేఖనము యితర శతకముల పఠనములుకూడా రోజు విడువకుండా జీవితాంతము కొనసాగించిన ఒక మహామనిషికి సంతానముగా జన్మించుటకన్నా పుణ్యఫలము ఏమి కలదు? ఆయనగారు అడుగవలసివస్తే ఎంత పెద్ద విలువగలపని అవతలి వ్యక్తికి చేసినా "ఈపూట ఉభయం నీదోయి" అంటారు.

వీరి నిత్యకృత్యములలో పూర్తి నిమగ్నత తప్ప సంసార విషయములపై ఆలోచించి విషయములు తెలుసుకొన్నవి వారి జీవితములో కొన్ని నిమిషములు మాత్రమేయుండును.

పిల్లల చదువుల విషయములోనూ మాతృశ్రీగారు మరియు మా

పూర్వపుణ్యఫలముగా మాకు వరముగా ప్రసాదించబడి తండ్రివలె కాపుకాచుకొని ప్రతిక్షణము మానడకను గమనించుచూ యించుక పొరపాటును దొర్లనీయక మాకు ఆరాధనీయులుగా నున్న మా అగ్రజులు శ్రీ వెంకటసుబ్బారావు గారు కల్పించుకొని బాగోగులు చర్చించుకొని నిర్ణయము చేసుకొని మా తండ్రిగారివద్ద సాయంత్రం వారు గుడినుండి తిరిగి వచ్చినప్పడు భోజనమునకుముందు విశ్రాంతి సమయములో వివరించగా వారు ఆమోదముద్ర వేసెడివారు. అంతకుమించి వారు అ లౌకిక విషయములను మనసుకు తీసుకొన్న క్షణములు లేవనియే చెప్పవచ్చును.

ఇందుకు ఉదాహరణలుగా...

మా నాల్గవ అన్నగారైన రామచంద్రరావుగారికి బి.ఇ. చదువుటకు 1962లో కాకినాడలో సీటువచ్చింది. అందులో చేరుటకుగాను కొంత ద్రవ్యము అవసరమైనది. మా అన్నయ్యగారు అమ్మగారు మాట్లాడుకొని తర్జుమాలుపడి, చివరకు ఒక నిర్ణయము చేసుకొన్నారు. ఏమంటే మా మేనమామ హనుమంతరావుగారు త్రోవగుంటలో ఉన్నాడు. ఆయన ఆర్థికపరిస్థితి బాగానేయున్నది. ఈ విషయములో ఆయన సహకారము పొందినయెడల అయినవాడు కాబట్టి బాకీతీర్చుటకు వ్యవధి ఉండును అనియూ రెండవ పక్షముగా ఆయనవద్ద యిద్దరు అమ్మాయిలు వున్నారు. వీడు చదువును పూర్తి అయిన తర్వాత అయినా పిల్లను యిస్తామంటే కాదనలేము కాబట్టి ఇప్పటి సహాయమునకు ఆయనకూడా ముందుకు వస్తాడని నిర్ణయించినారు. తర్వాత ఈ విషయమును మా తండ్రిగారివద్ద అదే సాయంకాలంపూట ప్రస్తావించినారు. ఆయన దానికి మనము వెళ్ళి అడిగితే మీ అన్నయ్య పైన చూస్తాడు. ఆయన స్వభావం నాకు తెలుసు కాబట్టి అయినవాళ్ళ దగ్గరకంటే యితరులే మేలు, కానీ మీకు నమ్మకముంటే మీలో ఎవరైనా వెళ్ళండి. నేను మాత్రము అడగను. ఆ తర్వాత పిల్లనిస్తానని అంటాడు, దానికి నాకు అభ్యంతరములేదు. డబ్బులు అతనిని అడగటం నాకు యిష్టంలేదు అని చెప్పినాడు. అంతే, మీరు అడగమని పర్మిషను ఇచ్చినారు కదా! అని మా అమ్మగారు ఆలోచించుకొని మా అమ్మవెళ్ళి అడుగుటకు నిర్ణయించుకొని త్రోవగుంట వెళ్ళింది. సొంత అన్నగారిని అంచనా వేయుటలో మా అమ్మగారు పొరపాటు పడిందికాని బావమరిదిని అంచనావేయుటలో మా తండ్రిగారు పొరపడలేదు. ఆయన ఏ విషయమును ఆలోచించినట్లు కనపడరు. తన తపస్సులో

తాను వుంటాడు కాని వీరందరి స్వభావములు ఎప్పడు తెలుసుకున్నాడో!

మా మామగారి ఇంటివద్ద మా అమ్మగారు ఈ ప్రస్తావన తేగానే ఆయన నేను చెప్పినదానికి మీరు ఒప్పకుంటే నేను వాడి చదువుకు ఆర్థిక సహాయము చేస్తానన్నాడు. ఆ ప్రతిపాదన ఏమంటే ఆయన రెండో కుమార్తెను వాడు వివాహము చేసుకోవాలి అని. దీనికి మా అమ్మ, వాడికంటే పెద్ద ఒకడువుంటే వాడి వివాహ నిశ్చయము కాకుండా చిన్నవాడి సంగతి ఏమిటని అడిగింది. దానికి ఆయన నిర్ధ్వంధముగా తిరస్కరించి వట్టిచేతులతో ఆడపడచును యింటికి పంపాడు. ఈ విషయము తెలుసుకొని మా అమ్మ ఆరోజు సాయంత్రానికి ఇంటికి చేరింది.

ఈవిషయం ముందుగానే తాను అనుకున్నది కాబట్టి ఆయన ఏమాత్రం ఆశ్చర్యపడలేదు.

మా గ్రామ మునసబుగారు శ్రీ కాకాని పాపయ్యగారు. ఆయన మితభాషి. కడుపులో కళ్ళు కలవాడని అందరూ అనుకుంటారు (దీర్ఘదర్శి) చాలా ఉన్నత భావాలు కలవాడు. గాంధేయవాది. కమ్యూనిష్టు భావాలు కలిసిన పెద్దమనిషి. ఆయన మా నాన్నగారు కలిసినపుడు వారి సంభాషణ చాలా విచిత్రముగా, ఆశ్చర్యముగా, సమన్వయముగాను పొడిమాటలతో భావగాంభీర్యముగా వుండి చూచువారలకు వినువారలకు ఏమీ అర్థముకానట్లుండును. వీరిరువురు దాదాపుగా ఒకేసారి ఉద్యోగములో చేరియున్నారు. సమమైన భావములతో ఎవరి పనిని వారు సక్రమముగా నెరవేర్చుకుంటూ ఒకరంటే ఒకరికి వల్లమాలిన అభిమానము, గౌరవము, ప్రేమ, ఆప్యాయతలతో వుండేవారు.

మా నాయనగారు ఆలోచనచేసి నేను మునసబుగారిని అడుగుతాను. తాను ఖచ్చితముగా సహాయపడ్తాడు. "అయినవారికంటే మనసున్నవారు" ముఖ్యము అన్నారు. మరునాడు నాన్నగారు యధావిధిగా కొత్తమాను సుబ్బారావు గారి గుడ్డలకొట్టు పంచలో పేపరు చదువుతూ పాపయ్యగారు ఎక్కడున్నాడో తెలుసుకొనిరమ్మని కోటప్పను పంపాడు. అక్కడికి దగ్గరగా మిర్యాలవారి షాపువద్దకు పాపయ్యగారు తరచూ వస్తూంటారు. ఆయన డిటెక్టివ్ పుస్తకాలు చదవడం చాలా యిష్టం. ఆషాపువద్ద అవి అద్దెకు యిస్తారు. ఆ విషయమెరిగిన కోటప్ప అక్కడ మునసబుగారు ఉండడం చూశాడు. అదిచూచి పాపయ్యగారు ఏమిటి కోటప్ప అన్నాడు. అయ్యగారు మీతో మాట్లాడాలన్నారు,

చూచిరమ్మనారు. తాను వస్తాడట, సుబ్బారావు కొట్టు దగ్గర వున్నాడు అన్నాడు. అంతట ఆయన నేను వస్తాను పద అంటే ఆయన చేతిలో పుస్తకాలను అక్కడపెట్టి సర్దుకొని లేచి వస్తున్నాడు. ఈలోగా మలుపు దగ్గరికి కోటప్ప అయ్యగారు కాపు (మునసబు) యిక్కడే వున్నాడని చెప్పగా ఈయన లేచివెళ్ళినాడు. ఇద్దరు సెంటరులో గాంధిబొమ్మ ప్రక్కగా ఎదురైనారు. ఎందుకు ఇది ప్రస్తావనంటే వారిలో వారు ఒకరంటే ఒకరికి ఎంత గౌరవమో తెలుస్తుంది కాబట్టి వారిరువురు ఎవరు మాట్లాడాలన్నా మాట్లాడవలసిన వారు అవతలివారి దగ్గరికి పోవాలన్న నియమం లేకుండా వారి అవసరమేమిటో తెలుసుకొందామని మునసబుగారు ఈయన వద్దకు వచ్చుట ఇక్కడవున్న మంచితనపు సొంపు.

రాగానే మునసబుగారు ఏమండి, అబ్బాయికి సీటు వచ్చిందటగా అన్నాడు. అవును అదే యిప్పుడు యిబ్బంది. అంతే ఆ మాటతోనే ఆయనకు అర్ధమయింది. ఈయన డబ్బును అడగడం కొరకు వచ్చాడు, ఆయనచేత అడిగించుకోవడమేమిటని తలచి, వెంటనే ఎంత అవసరమవుతుంది. ఎట్లా చేస్తున్నారు అన్నాడు. చేరడానికి 300 రూపాయలదాకా అవుతుందట. రేపే ప్రయాణమై వెళ్ళాలి, టైంలేదు అన్నాడు కరణంగారు. ఆ మరునాడు సాయంత్రం 4 గంటలకు పాపయ్యగారు త్రోవలో వెళ్తున్న మా అన్నయ్యగారిని పిలిచి మీరు చదువు ఆపకుండా ప్రయత్నించండి అని 300 రూపాయలు తీసి అన్నగారి చేతికి యిచ్చారు.

ఇది ఒక అపూర్వ సంఘటన. మా నాన్నగారు స్వయముగా అప్పుకొరకు మాట్లాడడం జరగకుండానే మునసబుగారు సహాయం చేయటం. రామచంద్రరావుగారు బి.ఇ. 3వ సంవత్సరంలో వుండగా మధ్యలో చెల్లించవలసిన ఫీజు కొరకు ద్రవ్యము కావలసి వచ్చినది. దానికొరకు మరలా ప్రయత్నం. అప్పటికే పిల్లలు చదువుల కొరకు పుస్తకాలని, ఫీజులకని యింట్లో మా అమ్మగారికి వున్న నగలు (40 సవర్లు) ఆ రోజుల్లో ధర తక్కువగుట వల్ల అమ్మివేయడం జరిగింది. ఇక మా యింటనున్న వెండికంచం కూడా అయిపోయింది. ఇక మిగిలినవి ఏమీలేవు కుదువకుగాని, అమ్మటానికిగాని. ఆ పరిస్థితిలో ఏమీ పాలుపోలేదు.

మా యింటికి దాపునే పెరికపాలెం వుంది. ఆ కులములో పెద్దగా వ్యవహరించే వ్యక్తులలో పిట్టల లక్ష్మయ్య ఒక ప్రముఖవ్యక్తి. ఆయన మా మేనత్తగారింట్లో పెద్ద పాలేరుగావుండి అన్ని విషయములు చూసేవాడు. అప్పటి పల్లెల్లో అందరూ వరుసలుగా

పిల్చుకునేవారుకదా. ఆయన వయస్సులో మా నాన్నగారికన్నా పెద్ద అందుకని మేమంతా "మామా" అని గౌరవించే వాళ్లం, మా అమ్మగారు అన్నా అనేది. నిజంగా ఆయన మా మేనమామలకన్న మిన్నయైన మామ.

ఈ కష్టంలో మా అన్నయ్య, అమ్మగార్లకు ఆయన కనిపించాడు చివరి మెట్టుగా. ఆయనను పిల్చుకొనివచ్చాడు మా అన్నయ్య. అప్పటికే రాత్రి 7.30 ని.లు అయింది. కరెంటు రోజులు కావు. గుడ్డిదీపాల వెలుగులు. బహుళం కావలె తిథిగుర్తులేదు. మొత్తంమీద చంద్రుడు కూడాలేడు. ఆయన వయోవృద్ధుడు, వయస్సు అప్పటికి 70 దాటాయి. నల్లటి విగ్రహం, ఆయన మేధస్సు పనిచేసింది. అబ్బాయి ఈరోజు మశోడు (అద్దంకి యాకోబు) దున్నను అమ్మినాడు. ఖర్చుపెట్టకపోతే వాడివద్ద డబ్బులుండవచ్చు. ఒకదీపం తీసుకొని నావెంటవస్తే మాదిగపల్లి పోయివత్తాం. మన ప్రయత్నం చెయ్యాలిగదా అన్నాడు. ఆ వెంటనే ఇంట్లోవున్న పాతలాంతరు ఒకదానిని వెలిగించి కర్రపోటుతో లక్ష్మయ్య మామ వెనకవస్తూవుంటే ముందుదీపంతో అన్నయ్య కలిసి పెరికపాలెంలోగుండా మాదిగపల్లివైపు నడిచారు. త్రోవలోవున్నవాళ్ళు, ఎదురైనవాళ్ళు, పంచల్లో అప్పటికే అన్నాలయి పడుకున్నవాళ్ళు ఆయనను ఎక్కడికి బాబా, మామా, తాతా అని పలకరిస్తుంటే సమాధానంగా ఇక్కడికేలే అంటూ మాదిగపల్లి మిట్టమీదికి చేరారు. అప్పటికే పల్లె ప్రశాంతంగా నిద్రలోకి జోగింది, ఒకరూ అర తప్ప, మిట్టమీద బడికొష్టం వద్ద నిలబడి బజారులో తచ్చాడుతున్న వ్యక్తివైపు చూచి దీపం పైకెత్తాడు మా అన్నయ్య. ఏవరా మనిషి? అన్నాడు మామ. వెంటనే ఆవ్యక్తి దగ్గరలోకి వచ్చి దీపంనీడలో వీరినిచూచి ఎందయ్యా యింత పొద్దేల ఈడకివచ్చారు. ఎవరు కావల అన్నాడు. దానికి మామ ఒరేయ్ మన మశోడ్ని నేను వచ్చానని కేకేయి అన్నాడు. వారు అక్కడనుండే యాకోబన్నా అంటూ పరుగుమీదవెళ్ళి పిల్చుకొని వచ్చాడు. మొదట వచ్చినవాడు ఎడంగా నిలబడ్డాడు. మశన్న మాత్రం కొంచెం దగ్గరికివచ్చి లక్ష్మయ్య మామ ఈయాలకాడ వచ్చినావేంటి, చినదొరగార్ని కూడా తీసుకొచ్చావే ఏంటి అంత అర్జంటు అన్నాడు.

మామ గొంతు సవరించి అక్కడున్న మెట్టుమీద కూర్చొని, వున్న విషయం మొదలుపెట్టాడు. మనం ఆ యింటిసొమ్ము తినివున్నాం. యిప్పడు కరణంగారి అబ్బాయికి ఫీజు కాకినాడలో కట్టాలంటా! అయ్యగారి సంగతి నీకు తెలుసుగా. ఏడనుంచి తెస్తాడు.

తర్వాత నిదానంగా తీర్చుకోవలసిందే కదా! నన్ను పిలిచి విషయం చెప్పారు. నాకాడ లేవుకదా! అందుకనే డబ్బులు ఎక్కడున్నాయో తెలుసుకొని వెళ్తే పని అవుతుందని, నీవు దున్నను అమ్మిన సంగతి నాకు తెలుసు. కాని ఖర్చు పెట్టకపోతే నీకాడ వుంటాయని వచ్చా. నీవే యిప్పుడు మాకు ఆ డబ్బులు సర్దాల. మళ్ళా 4 రోజులలో ఊళ్ళోనే నీకు ఏర్పాటు నేనుచేస్తా. అర్జంటు అందుకని ఈ జాముకాడ వచ్చాం అన్నాడు. అంతట యాకోబు నల్లటి మొహంపైన ఎర్రటి పండ్లతో ఒక చిరునవ్వువేసి నేను దున్నను అమ్మిన సంగతి తెలుసుకొని నాకాడకి దొరగారిని తీసుకొచ్చావ్ అంట మామా! నీ తెలివి అని నవ్వి! యిప్పడే తెస్తా ఎంత కావాలన్నాడు. నీవు అమ్మింది 70 రూపాయలకే కదా అంతాకావాలన్నాడు. వెంటనే మారుమాట లేకుండా వెళ్ళి యాకోబు డబ్బులు తెచ్చియిచ్చాడు. ఆసారికి పబ్బం గడిచింది.

ఇంకొకసారి, ఇంకొకసారి, ఇంకొకసారి, ఎన్నిసార్లకయినా ఇదే తిప్పలు. ఏరోజుకారోజు బోజనానికి నాన్నతెస్తే పై సరుకులకు పిల్లల పుస్తకాలకు, ఫీజులకు అన్నయ్యకొచ్చే డబ్బులు చాలక పాతబాకీలకు కొంతచెల్లులు. కొట్లో బాకీలకు కొంతచెల్లు, పెన్నులు, రబ్బర్లు, నోట్సులు, ఎన్నిరకాల ఖర్చులు, యింతమందికి ఆ మహానుభావుడు ఎలాచేసేవాడో వ్రాస్తే అదొక పెద్ద కథనం.

అడపాదడపా అందరికీ 3 నెలలకొకసారి ఫీజులు హైస్కూలులో కట్టాల్సిందే. ఆ ఫీజు సరియైన సమయంలో కట్టకపోతే దానిపై 50 పైసలు ఫైను వెరసి ముగ్గురికిగాని, ఇద్దరికిగాని ఈఫైను తప్పదు. ప్రతిసారి దాదాపుగా ఫైన్లతోనే చెల్లింపు. దానికై యింటిలోని ఏదో ఒక విలువైన వస్తువు అమ్మకం లేదా తాకట్టు. దానిని విడిపించలేకపోతే తిరిగి అమ్మకం. ఆ చౌకరోజులలో అట్లాగే మా అమ్మగారి సొమ్మంతా పోయింది. అయినా ఈ చదువులు ఆగలేదు. బ్రతుకుబండి ఆగలేదు. సాగుతూనేవుంది. అమ్మ, నాన్న చక్రాలతో అన్నయ్య సారధ్యంతో.

అప్పటికే రామచంద్రరావు నాల్గవ సంవత్సరం చదువుతున్నాడు. మా నాన్నగారికి కరిణీకం యిచ్చేటప్పడు హనుమయ్యగారు 4 ఎకరాల యిసుక భూమిని చూపించి నీవు దీనిని జాగ్రత్తచేసుకో, భవిష్యత్తులో ఉపయోగపడ్తుంది అని చెప్పాడు. ఆయన చెప్పిన ప్రకారం దానిని బాగుచేయించటానికి చాలాశ్రమపడ్డారు కాని అది యిసుకభూమి కావడంవల్ల అప్పట్లో పంటకురాలేదు. నేను పి.యు.సి. చదువుదామని అభిలాష, మా

అన్నయ్య, అమ్మ నన్ను డాక్టరు చదివించాలని బై.పి.సి. గ్రూపు ఇప్పించారు. మానవుడి మేధస్సు ఎంతవరకు. నాకు వచ్చిన అత్తెసురు మార్కులకు ఆ చదువులో సీటురాదని తెల్సింది. ఇక మిగిలిన చదువుల వేటలో అర్జీలు పెట్టుకున్నాను. ఆరోజు అనగా నేను మా నాన్నగారితో మాట్లాడిన చివరిమాటలు. అన్నయ్య, అమ్మ, నేను సంప్రదించుకొని నేను నాన్నను అడిగితే ఆయన నిర్ణయం ప్రకారం పోదామనుకున్నారు. అప్పటికే యిద్దరు చదువులలో వున్నారు. అందుకని అదే సమయం అంటే ఆయన గుడినుండి వచ్చి విశ్రాంతిగా నామంచేసుకుంటూ ప్రక్కపైన కూర్చున్న సమయంలో నేను ఆయన మంచం దగ్గర నిలబడి, నాన్నా! నేను బి.ఎస్.సి.లో చేర్తాను అన్నాను. ఆయన ఒకక్షణం కాగానే, ఈ సంవత్సరం నీవు ఆగు. వచ్చే సంవత్సరం చూడొచ్చు అన్నాడు. నేను బాగా ఖిన్నుడనయ్యాను. కాని వెంటనే తేరుకున్నాను. కారణం మనకు తెలిసిందే. ఆర్థికభారం ఎక్కువయితే అందరి చదువులు యిబ్బంది కదా! వచ్చేయేడు చదువుతాలే అన్నాను.

కాని మానవ మేధస్సులో మాకు కలిగిన ఆలోచనలకు ఆయన ఈ సంవత్సరం ఆగు అని చెప్పడానికి చాలా భావ వ్యత్యాసంవుంది. ఆయనకు తెలుసు ఆయన ఎందుకు ఆగమన్నాడో, మాకు తెలిసిన ఆర్థికభారం కాదు. ఆయన ఉద్దేశ్యం యింకాఏదో వుంది పరమార్థం. అది పరమార్థం. అందుకే ఆయనకు తెలుసు, ఆ పరమాత్మకు తెలుసు.

పిల్లలు ఖాళీగా ఉంటే చెడిపోతారని మా అన్నయ్య జాగ్రత్తవహించుచూ ఉంటాడు. నేను ఖాళీగా వుండటం యింటివద్ద మంచిదికాదని మా అన్నయ్య మా మామయ్యగారికి ఉత్తరం వ్రాసి ఏదైనా టెంపరరీగా పనిచేసే ఉద్యోగం చూడమన్నాడు.

ఆయన అప్పడు లాంఫారంలో అగ్రికల్చరల్ డిపార్టుమెంట్‌లో గుమాస్తాగా పనిచేస్తున్నారు. ఈయన పేరు కామేశ్వరరావు. 2వ ప్రపంచయుద్ధంలో నేవల్ సైనికుడిగా పనిచేసి తర్వాత మెడికల్‌గా డిశ్చార్జ్‌అయి ఈ ఉద్యోగంలోచేరి ఎక్కువకాలం బాపట్లలో పనిచేసి తర్వాత ట్రాన్స్‌ఫర్ అయి లాంఫారంలో చేరాడు. ఆయనకు మా అక్కయ్యగారైన రంగ రాజ్యలక్ష్మమ్మ గారిని యిచ్చి వివాహం చేశారు. వారికి అప్పటికి ఇద్దరు కూతుళ్ళు, ఒక కుమారుడు వున్నారు. ఆయన తన పలుకుబడిని ఉపయోగించి లాంఫారంలో “మిల్లెట్ స్పెషలిస్ట్” ఆఫీసులో ఒక గుమస్తా. 6 నెలలు సెలవుపైన వెళ్ళిన ఖాళీలో ఆయన వచ్చేవరకు టెంపరరీగా గుమస్తాగా ఉత్తర్వులు వేయించారు.

నేను ఆ సమయంలో అమ్మ, నాన్నగార్ల వద్ద సెలవుతీసుకొని చదువులేదు కాబట్టి ఒంగోలులో మా పిన్నిగారికి తోడుగా వుంటున్నాను. మా పిన్నిగారంటే మా బాబాయి సత్యనారాయణ గారి భార్య. ఆయన చనిపోతే ఆమె స్వంతంగా ఒంగోలులో యిల్లు కొనుక్కొని అక్కడే వుంటున్నది. ఆమె మా మూడో అన్నయ్యను దత్తత తీసుకొని చదివించుకుంటున్నది. ఆమెవద్దనే మేము నాలుగు, ఐదు వారలము పి.యు.సి. చదువుకున్నాము. అద్దంకిలో ఎస్.ఎస్.ఎల్.సి. కాగానే ఆమె దయతో అంగీకరించి భోజనం పెడ్తే, మావాళ్ళు ఫీజులు కట్టి చదివించేవాళ్ళు. అక్కడికి మాకు కబురు వచ్చింది. నేను లాంఫారం కెళ్ళాలని. నేను నేరుగా లాంఫారం వెళ్ళి యిచ్చిన ఉద్యోగంలో పనిచేస్తున్నా. రెండు జీతాలు తీసుకొన్నా. మొదట్లో కష్టంగావున్నా, రెండో నెలనుండి పనిచేయడంలో నిపుణత ప్రదర్శించడం మొదలుపెట్టా.

లాంఫారంలో వీరందరికి క్వార్టర్స్ ఉన్నాయి. చాలా ఆహ్లాదకరమైన వాతావరణం. మధ్యలో రోడ్డు, రెండువైపులా క్వార్టర్స్. ప్రతి క్వార్టర్ముందు వృక్షములు. చుట్టూ మామిడి, అరటి తోటలు వాళ్ళ పర్యవేక్షణలో. ప్రక్కన కొండ. ఆ వాతావరణం చాలా హాయిగావుండేది. ఒక కిలోమీటరు లోపలే ఆఫీసు. ఆఫీసు చుట్టూ షుమారు 300 ఎకరముల రీసెర్చ్ సెంటరు, సాగుఅవుతూ వుంటుంది. ఒకవైపు ప్రభుత్వము వారిచే నడపబడుచున్న మరెన్నో పాలిచ్చే బలిసిన బర్రెలు, ఆవులు. అక్కడ ఉద్యోగం నా పాలిటవరం అనుకున్నా. ఉదయాన్నే లేవడం, స్నానాదికములు కాగానే సుప్రభాతం మరియు అక్కడ మా అక్కయ్యగారింట్లో లభించిన విష్ణుసహస్రనామం పుస్తకం చదవడం. చద్ది అన్నం తిని అంటే వేడిగా వండిందే. క్యారేజి తీసుకొని ఆఫీసుకు వెళ్ళడం, సాయంకాలం 5 గంటలు కాగానే మరలా రావడం. విష్ణు సహస్రనామం, ముకుందమాల చదవడం. ఎదురుగా ఎ.ఎం.ఎస్. గారింట్లో వాళ్ళ అబ్బాయికి లెక్కలు కాస్త యిబ్బంది అంటే అతనికి లెక్కలు చెప్పడం హాయిగా వుంది కాలక్షేపం.

పులికడుపున పులిపుడ్తుంది అంటారు. పండితపుత్ర శుంఠః అంటారు. కాని ఈ రెండూ జరుగుతూ వుంటాయ ప్రపంచంలో. 3 నెలలు కాలం గడిచేటప్పటికి నాకు ప్రతిరోజు వరుసగా ఒక కల రావడం తటస్థించింది. అప్పటికి మా అక్కయ్యగారు గర్భవతి.

నాకు ఈ కలవస్తుంది. చెప్తే ఏమో చెప్పకపోతే ఏమో. సరే ఈ డోలాయిమానంలో వుండగా మూడవరోజు రాత్రికూడా అదేకల వచ్చింది. ఆరోజు నేను ఆ కల వివరాలు భయం కలిగించినందున నా డైరీలో వ్రాయడం మొదలుపెట్టాను. మా అక్కయ్య అదిచూచి ఏందిరా అట్లావున్నావు, రెండు రోజులనుండి అదో మాదిరిగా ఉన్నవేంటి అంది. నాకు కొంత ధైర్యం వచ్చింది. వెంటనే కలలోని విషయం ఈమెకు చెప్పవచ్చు అనుకున్నా.

నెమ్మదినెమ్మదిగా, బెరుకుగా, భయంగా, ఆర్చి, ఆర్చి చెప్పడం మొదలెపెట్టాను. కళ్లకు కట్టినట్లు, దాని సారాంశం మా నాన్నగారు పరమపదించడం, ఆ ఉద్యోగ భారం నేను చేయడం. నేను కన్నకల నిజం కూకూడదని నేను ఎంతో వేడుకున్న. అక్కయ్య ఈ విషయం విన్నవెంటనే పిచ్చివేషాలు వెయ్యకు, మూతిమీద కొడ్తా. ఎవ్వరికీ ఈ విషయం మళ్లీ చెప్పక అన్నది. నేను ఆ విషయం మరలా ఆమె చెప్పేదాకా ఎవ్వరివద్దా చెప్పలేదు. కాని నా ఆందోళన తగ్గలేదు. ఏదో ఆలోచన నన్ను సంతోషంగా ఉండనివ్వలేదు.

తర్వాత పదిహేను రోజులు జరిగింది. ఆరోజు 9.1.1966 నేను మా మామయ్య ఆఫీసులో ఎదురెదురుగా పనిచేసుకుంటున్నాం. 11 గంటల సమయంలో ఎవరో పిలుస్తున్నట్లుగా మామయ్య వాకిలివైపుచూసి లేచివెళ్ళాడు. నేను తలత్రిప్పి చూచేసరికి వాకిట్లో అద్దంకిలో మాయింటికెదురుగావున్న అద్దంకి హనుమంతరావుగారు నిలబడివున్నారు. మా మామయ్య ఆయన వద్దకు చేరుకున్నారు. ఆయన గేటువైపుకు నడుస్తున్నాడు. నాకు ఆందోళన అధికమైంది. ఒక్క ఉదుటున లేచి వాళ్ళ వద్దకు చేరాను. మా నాన్నకు ఎట్లావుంది బావా! అన్నాను. ఆయన నిరుత్తరుడు అయినాడు. ముఖములో కళలేదు. కాసేపటికి తేరుకొని నేను అమరావతి వెళ్ళివస్తున్నాను. వస్తూ త్రోవలో మీ మామయ్యను పలకరిద్దామనుకుంటూ వచ్చాను. నీవు కూడా యిక్కడేవున్నావా? సరే నీవు వెళ్ళి పనిచూసుకో నేను మీ మామతో మాట్లాడి వెళ్తానన్నాడు. నాకు అనుమానం పెరిగింది కాని ఆయన స్వాంతనపు మాటలను నమ్మలేదు. మా నాన్నకు ఎట్లావుంది అని మళ్ళా అడిగేను. నేను వచ్చేటప్పుడు బాగానే వున్నాడే. ఏదో కొంత జ్వరంగా వుందన్నారు. నాకు యింకేంతెలీదు, నీవు వెళ్ళు నాకు చాల టైం అయింది, నేను వెళ్ళాలి. మీ మామయ్యతో మాట్లాడి వెళ్తానన్నాడు. మా మామయ్యకూడా నన్ను సీట్లోకి పొమ్మని బలవంతంచేశాడు. నేను కొంచెం వెనక్కి తగ్గి మీరేదో మోసం చేస్తున్నట్లున్నారే అంటూ లోపలికి వచ్చా. 4,5

నిమిషాల తర్వాత మా మామయ్య సూపరింటెండెంట్ గారి దగ్గరకువచ్చి సెలవు కాగితం యిచ్చి, మెల్లగా వాకిట్లోకి వెళ్ళాడు. నాతో ఏమీ చెప్పలేదు. నేను ముందునుండే అనుమానంతో వుండడంతో నేనుకూడా సూపరింటెండెంట్ వద్దకు వెళ్ళి నేను కూడా సెలవుపెడ్తానన్నాను. ఆయన నీ వెందుకయ్యా సెలవు, అసలే టెంపరరీవాడివి అన్నారు. కాదండీ అద్దంకివెళ్తే సంగతి తెలుస్తుందండీ అన్నాను. (జీరగొంతుతో) దాంతో ఆయన ఆలోచనలో పడ్డాడు. అంటే ఆయనకు విషయం తెల్సినట్లుంది. సాలోచనగా సరే వ్రాసిచ్చి వెళ్ళు అన్నాడు. నేను వెంటనే ఒకరోజుకు సెలవు వ్రాసి ఆయనకు చెప్పియిచ్చి నేరుగా అడుగులేస్తూ రోడ్డుపైకి వచ్చాను. అప్పటికే వాళ్ళు చాలాదూరం వెళ్ళారు. నేను కూడా వారిని వెంబడించి త్వరగా వెళ్తూవున్నాను. వాళ్ళకు 50 అడుగుల దూరంలోవుండి వెంబడించడం మొదలుపెట్టాను. వారు వెనక్కితిరిగి చూశారు, నిలబడ్డారు. నేను కూడా నిదానంగా అడుగులువేస్తూ నడుస్తుండగా వాళ్ళు నన్ను రమ్మని పిలిచారు. నేను వేగంగా కదిలి వాళ్ళను చేరాను. అక్కడ రోడ్డుమీద ఆపి మీ నాన్న గారికి ఒంట్లో బాగాలేదు అందుకని మీ మామయ్య అక్కయ్యను తీసుకొని రమ్మన్నారు. నీవు చిన్నవాడివి కదా! వద్దన్నారు అన్నాడు హనుమంతరావు గారు.

నేను వెంటనే ముప్పిరిగొన్న దుఃఖం గొంతులో నింపి ఎందుకు బావా యింకాదాస్తావు? మా నాన్నకు ఏదో అయింది. అందుకే నిన్ను పంపించారు. నాకల నిజం అయింది అన్నాను. అంతట వారు నన్ను సముదాయించి నీవు ఈ విషయం మీ అక్కయ్యకు చెప్పకుండా వుండు అందరం వెళ్దాం ఆమెకు మాత్రం బాగాలేదని చెప్దామన్నారు. అందుకు నేను సరే అని చెప్పి వేగంగా అందరం యిల్లు చేరాము. ఆమాటే అక్కయ్యకు చెప్పి నాన్న ఒకసారి మనలను రమ్మన్నారట అని ఆ అమాయకురాలిని నమ్మించి గుడ్డలు సర్దుకొని బయలుదేరాము. కొన్ని గుడ్డలు ఆరలేదురా! ఎట్లా అంది అక్కయ్య అవి వేరే సంచిలో సర్దుకొని బస్సులో ఆరవేద్దాంలే అన్నాను. అదే కావాల, మనవాళ్ళు తడిగుడ్డలతో ప్రయాణం అశుభసూచకమన్నారు. బయలుదేరి గుంటూరువచ్చి మేదరమెట్ల వచ్చి అక్కడినుంది అద్దంకి చేరాము. ఇంకేం అద్దంకి బస్టాండులో రాత్రి 7.30 గంటల ప్రాంతంలో రిక్షా ఎక్కి బయలుదేరగానే ఆ రిక్షా అతను యిప్పడే మీ రెండో అన్నయ్య వాళ్ళను దించివచ్చాడన్నాడు. అప్పడు మా అక్కయ్య ఎందుకురా! వాడెందుకు వచ్చాడు అని అడిగింది

కొంత ఆతుర్తగా. ఏమీలేదులే నాన్నకు జ్వరం తగిలింది కదా ఆయనకు తెలిసి వచ్చివుంటాడన్నాను. అద్దంకి వారి బజారులోకి వెళ్ళేటప్పటికి బజారులో వాకిటిలో అంతా జనం వున్నారు. రిక్షా ఆపగానే పెట్రోమాక్స్ లైటు వెలుతురులో మా నాన్నగారి శవం చూడగానే నేను కొంతసేపు అలాగే నిలబడి ఏ ఆలోచనా లేకుండా ఆగిపోయినాను. ఎందుకు యిలా జరిగింది నాకు కల ఎందుకు వచ్చింది. అదే సీను యిక్కడ ప్రత్యక్షమయింది. నాకు ఏమైనా దివ్యశక్తులు భగవంతుడు ప్రసాదించాడా? లేక యిది యాదృశ్చికమా? ఏమి పాలుపోలేదు. యింతలో మా అక్కయ్య వున్నపలాన కేకవేసి పడిపోయింది. తర్వాత ఎప్పటికో కోలుకుంది.

ఎంత విచిత్ర సంఘటన ఏమీ ఈ చిద్విలాసము. నాకు చదువు ఈ సంవత్సరం ఎందుకు ఆగమన్నాడు. ఈయనకు ముందే తెలుసుకాబోలు తనపని పూర్తి అయిందని తన వారసత్వంగా ఈ ఉద్యోగానికి నన్ను వుంచాలని నిర్ణయించుకొనినట్లుంది. తెల్లవారేలోపు కార్యక్రమాలన్నీ పూర్తిచేసి యింటికి రాగానే జనమందరూ పాపయ్య గారింటికి, అక్కడ నుండి ఆయనను తీసుకొనివచ్చి మాయింటి ఎదురు అరుగులపైన కూర్చుండి వీరి కుటుంబములోని వారు కరణంగా వుండాలని పట్టుబట్టడం దానికి అన్నయ్య, అమ్మ సరే అనడం. దానికి నన్ను ప్రతినిధిగా అంగీకరించడం అనుకోకుండానే సాదాసీదాగా మామూలు చర్యలుగా జరిగిపోయినది. దీనికి నా మనస్సు ఏ మాత్రం చంచలించలేదు. కారణం తెలియదు. బహుశ! ఈ సూచనను నేను ముందుగానే దర్శించడం మూలాన కాబోలు లేదా మా నాన్నగారే రాత్రివేళ ఆయన ఆలోచనలను నాలోకి టెలిపతి ద్వారా పంపించి ఆలోచింపజేసి యిచ్చినాడా! చెప్పట కష్టమే. ఆయన అంతటి వాడే. లేకపోతే ఆయన చనిపోవు ముందురోజు చిన్న పెట్టె తెరిచి ఏవో కాగితాలు కాసేపు చూచుకొని మా అన్నయ్యను పిలిచి తన పొలం దగ్గరికి తీసుకొనిపోయి పది లింకుల కర్రతో కొలత వేయించి ఈ 0-10 సెంట్లు భూమి నేను నిత్యము భజనచేయు దేవాలయంలో స్వామి అయిన రామలింగేశ్వర స్వామి కైంకర్యమునకు వప్పగించమని అప్పగింతలు చెప్పగలడా! అన్నయ్య ఈ విషయం చెప్పగానే కొలత ఎందుకని వారించినా వినకుండా పొలము తీసుకొనిపోయి అక్కడ కొలత చూపించి గట్టు పెట్టి రావడం అప్పగింతలుకాక మరేమిటి.

అట్టి మహానుభావునికి యిచ్చిన ప్రతికూలపరిస్థితులు చాలవన్నట్లు ఆయన పూర్తిగా విముఖముగా వుండే ఆస్తిని కొంత ఏర్పాటుచేస్తే నాన్న వ్యామోహపడ్తాడని అనుకున్నాడో ఏమో భగవంతుడు ఆ పరీక్షకు ఉపక్రమించాడు.

మా నాన్నగారి సోదరి మహలక్ష్మమ్మ గారికి అనుకోకుండా పెద్ద జబ్బుచేసింది. ఆమె నిత్యము భగవన్నామ సంకీర్తనలతోనే కాలంచేసేది. శ్రీ దామోదర కృష్ణదాసు గారి వద్ద సమాశ్రయము పొందియున్నది. తూము నరసింహదాసుగారి కీర్తనలు, వాసుదాసుగారి కీర్తనలు శ్రీకృష్ణా లీలా తరంగిణి రామదాసు కీర్తనలు వీటిని ప్రభాతసేవ నుండి ఏకాంత సేవ వరకు పాడుకొనుచూ ఆయా కీర్తనలను క్రియలకు అనుసంధానము చేసుకొనుచూ వచ్చిన వారితో కూడా ఎక్కువ భాగము ఆయా లీలలను గూర్చిన విషయములనే మాట్లాడుకొనుచూ కాలం గడుపుతూ వుండేది. ఆమె చిన్నవయస్సులో వైధవ్యము పొందినందున నిస్సంతువు అయినందున ఆమెకు రాబడిన వాటా పొలములో వచ్చిన అవేజితో కాలం గడుపుతూ వుండేది. భాగవతులతో తీర్థయాత్రలుచేసి వచ్చేది. యిద్దరు తమ్ముళ్ళ వద్దకు పోయి కొంతకాలం (నెలలు) వుండివచ్చేది. యిక్కడ మా అమ్మగారు ప్రసవించగానే పేరు కొరకు మానాన్నగారు మా అత్తయ్య గారిని సలహా అడిగేవారు.

నాయనగారు బ్రాహ్మీ ముహూర్తములో 4.30 గంటలకు గోవింద నగధారి గోపాల వనమాలి అనుచూ నిద్రలేచి ఆ కాలము ఈ కాలము అనుకోకుండా కొల్లాయిగుడ్డ కట్టుకొని పైపంచ వేసుకొని బిందె చెంబు తీసుకొని గుండ్లకమ్మ నదీతీరానికి ఒక మైలు చీకటిలోనే నడుచుకుంటూ ఒంటరిగా వెళ్ళేవారు. అక్కడ కాలకృత్యములు తీర్చుకొని గుండ్లకమ్మ నదీ జలాలలో స్నానమాచరించి చలం కొట్టివుంచేవారు. ఆ తర్వాత సంధ్యావందనము ఆచరించి గాయిత్రీ మంత్రానుష్ఠానము కావించెడివారు. ఈలోగా చలంలో నీరు వూరేది. ఆ నీటిని జాగ్రత్తగా బిందెకు చెంబుకు నామస్మరణతో నింపేవారు. తడికొల్లాయిగుడ్డ మడచి మోకాళ్ళవరకు కట్టుకొని, పైపంచ భుజానవేసుకొని కుడిచేతి భజముపై బిందె దానిపైన చెంబు దాని ప్రక్క చిన్నగుడ్డ వేసుకొని నిరంతర నామస్మరణతో బయలుదేరి 7 గంటలలోపుగా యింటికి చేరేవారు. ఈ కార్యక్రమములో ఎన్నడునూ మార్పులేదు. ఎప్పడైనా గ్రామాంతరము వెళ్ళినపుడు తప్ప, చలికాలంగాని, వర్షాకాలంగాని, జోరుగా వర్షాలు కురుస్తుండగాగాని, గుండ్లకమ్మ నది పొంగిపొరలి ఊరికి దగ్గరలోకి

వచ్చినపుడుగాని, ఆ నీటిలో స్నానం చేయాల్సిందే. ఆ నీరు తెచ్చుకొని ఆ నీటినే త్రాగేవారు కాని వేరే నీఉ త్రాగేవారుకాదు. అంతటి ఖచ్చితమైన నియమమును ఆచరించేవారు. ఎర్రనీరుకదా అని పాలుమాలేదికాదు.

అంటే ఆయన ఎంచుకొన్న పనిని శ్రద్ధగా, ఒకే సమయానికి ఒకే పద్ధతిలో తన జీవిత పర్యంతము ఏ విధమైన రాజీలేకుండా సర్దుబాటు ధోరణి లేకుండా కొనసాగించిన నియమమైన జీవితాన్ని వీడి అమరుడైన వ్యక్తులలో నాయనగారు ఒకరు.

ఏదైనా ఒక పనిని ఒకే సమయానికి ప్రతిరోజు చేస్తూవుంటే దానియొక్క శక్తి అగణ్యంగా వుంటుందని శాస్త్రవచనముకదా! వీరు ప్రతిరోజు గాయత్రి మంత్రానుష్ఠానము బ్రాహ్మీ ముహూర్తమున ఒకే ప్రదేశములో నిశ్చలముగా ఏకాగ్రతతో ఆర్థతో, అదీ నదీ తీరమున కావించెడివారు. అందుకనే వారు చేసిన జపముయొక్క ప్రాముఖ్యత పదింతలుగా, నూరింతలుగా, వేలరెట్లుగా ఫలితం వచ్చేది.

సంధ్యావందన విషయములను యిక్కడ ప్రస్తావించుట ఔచిత్యమని భావించుచున్నాను.

"సహస్ర కృత్వస్త్వ భ్యస్వబహిరేతత్త్రికంద్విజః

మను ॥26॥79

ద్విజుడు సంధ్యాకాలమందును తక్కిన సమయమందును గ్రామమునకు వెలుపల ఓంకారముతో కూడిన వ్యాహృతి త్రయాత్మకమైన గాయత్రిని వేయిపర్యాయములు ప్రతిదినము జపించని యెడల నొక్కరూపము సర్పము కుబుసమునుండి విడివడినట్లు మహాపాపము నుండియు విడుదల పొందును.

"విధి యజ్ఞాజ్జ పయజ్ఞో విశిష్టోదశభిర్గుణైః

ఉపాంశుప్స్యాచ్చంతుగాణః సాహస్రోమానసః స్మృతః

మను ।2।87।

జ్యోతిష్టోనుండి యోగము లొనర్చుటకంటే ఓంకార మహావ్యాహృత్యాదులు జపము పదింతలు మేలు. ఆ జపమే ప్రక్కనుండి వారికి వినబడకుండా జపించుట మరింతట హెచ్చు. మానసికమైనచో వేయింతలు హెచ్చు.

నాన్నగారు మానసిక జపము చేయుటలో ధర్మశాస్త్రబద్ధమైన విధిహితము నిత్యము జరిపెడివారు. యిది పూర్వ జన్మఫల దివ్యజ్ఞాన సంపత్తియే.

జప్యేనైవతు సంసిద్ధ్యే బ్రాహ్మణో నాత్రపంశయః

యేపాక యజ్ఞాశ్చత్వారో విధయజ్ఞసమన్వితాః

సర్వతజపయజ్ఞ స్వకలాం నార్హతిషోడశమ్ ।

వైశ్వదేవము, బలికర్మ, నిత్యశ్రాద్ధము, లతిథి భోజనము అను నాలుగు పంచమహా యజ్ఞములలో బ్రహ్మ యజ్ఞము తప్ప తక్కినవి వీనికి బాకయజ్ఞములనిపేరు. దర్శపూర్వమాసాదులు విధియజ్ఞములు. ఈ నాలుగు పాకయజ్ఞములు విధియజ్ఞములును గాయత్రాదిజప యజ్ఞము యొక్క పదునాల్గవ భాగమునకు జాలవు.

మను ।2।89

నాయనగారు అట్టి జపయజ్ఞమును నిరంతము నిర్వర్తించెడివారు. అందువలనే ఆయనలో బ్రహ్మతేజస్సు ఉట్టిపడుతూవుంటుంది. ఆయనకు పరమాత్మకు నిత్యానుసంధానము కలిగియుండుట వలననే ఆయనను చూడగానే ఎట్టాంటివారు కూడ రెండు చేతులతో నమస్కరించి తరించుచుందురు.

యింటికి రాగానే బిందె దించి చెంబును ప్రక్క యింటిలోనే కాపురముంటున్న వారి తన పెద్దతల్లి గారైన తురిమెళ్ళ లక్ష్మమ్మ గారికి యిచ్చేవారు. ఆమె అప్పటికే వృద్ధురాలు. వైధవ్యము పొంది ఒంటరిగా వండుకొని తింటూవుండేది.

మా నాయనమ్మ వాళ్ళు ఏడుగురు అక్కచెల్లిండ్రు. వారలో ఈమె రెండవది. మా నాయనమ్మగారు ఐదవది. మేము పిల్లలము ఏదోఒక గోలచేయుచూ ఆవరణ అంతా తిరుగుతుంటాము. ఆమెకు పెద్దగా యిష్టముండెడిదికాదు. అందువలన పిల్లలను ఏదోఒకటి అంటుండేది. యిది మా అమ్మగారికి కష్టంగా వుండేది. అందువలన వీరిద్దరూ మాట్లాడుకోవడం తక్కువ. లక్ష్మమ్మ నాయనమ్మగారు కూడ నారాయణ, గోవిందనామములతో కూడిన పాటలు పాడుకుంటూ పనులు చేసుకుంటూ వుండేది. పిల్లల అల్లరి భరించలేకపోవుట తప్ప ఆమెకు యితర ద్వేషములేదు. మా నాయనగారంటే ఆమెకు యిష్టమే. మా అమ్మగారికి యిష్టంలేకున్నా కూడా ఆమెకు నీళ్ళు తెచ్చి యిచ్చేవారు, మా నాయనగారు. ఆ నీళ్ళు త్రాగటానికి ఆమె ఉపయోగించుకొనేది. మా బావినీళ్ళు

బాగానే ఉంటాయి కాని కొంచెం వేడిచేస్తాయి. నాన్నగారు గుండ్లకమ్మ నీరు తెచ్చుకోవడం వలన ఆరోగ్యంగా వుంటుందని తెలిసి ఆమె ఒకరోజు ప్రస్తావించగా నరసింహం నేను బావినీళ్ళు త్రాగితే వేడిగా వుంటున్నది. గుండ్లకమ్మ నీరు తెచ్చుకోలేను. ఏంచేయాలో తోచడంలేదు అంది. అంతే ఒక చెంబును ఏర్పాటుచేసుకొని ఆ చెంబును బిందెపై పట్టుకొని ఆమె కొరకు ఆ నీళ్ళు తెచ్చి యిచ్చేవారు మా నాన్నగారు. పెద్దలన్నా, వారి మాటలన్నా వారికిగల గురుత్వము అటువంటిది. ఈపని ఆమె జీవిత పర్యంతము నెరవేర్చినారు.

ఎందుకు చెప్తున్నానంటే ఒకపని ప్రారంభించి తుదివరకు నెరవేర్చులోగా ఎన్నో ఆటంకములు, యిబ్బందులు వస్తూవుంటే వాటిని అవరోధాలుగా మనము లెక్కించి మధ్యలో ఆపివేయుట గాని, కొంతకాలము వాయిదా వేయడంగాని చేయుట అతి సామాన్యము. కాని ఆయన అతి సామాన్యముగా కనిపించే మహామనిషి. అందుకనే ఏ చిన్న దినచర్య అయినా ప్రతిరోజు ఒకేరకంగా ఉటుంది. దానికి వైరుధ్యమవడంగాని, మార్పులుగాని, సవరణలుగాని లేవు. అదే గొప్ప విషయం. యిది ఒక వికాసవంతమైన వ్యక్తిత్వము.

తర్వాత తన తెల్లధోవతి కట్టుకొని, కోరా బనియన్ వేసుకొని, కొరాగుడ్డతో కుట్టించిన నిండుచేతుల చొక్కా ధరించేవాడు. వెంటనే విభూతిని ముఖమునకు వ్రాసుకొనేవారు. ఒక యిత్తడి గ్లాసుతో మా అమ్మగారు కాఫీ పానీయం యిచ్చేవారు. అవి త్రాగుతూవుండే సమయంలో మాత్రమే మా అమ్మగారికి గాని, మాకుగాని ఆమనతో కుటుంబ విషయములు చర్చించే సమయం. పిల్లల పుస్తకాలు కొనడంగాని, ఫీజులు కట్టడం గాని, యింట్లో లేని వస్తువులు (రోజు వుండేదే) చెప్పడం గాని, గ్రామాంతరంలోవున్న ఆడపిల్లల విషయంలోగాని, అప్పడు ప్రస్తావిస్తే వింటూ కాఫీ త్రాగేవారు. మా అమ్మగారు కూడా ఎక్కువగా యిబ్బంది పెట్టకుండా ఆ పూటకు లేదా ఆ రోజుకు అర్జంటు అయిన విషయములు మాత్రమే చెప్పేది.

పిల్లలు స్కూలులో పరీక్షలు అయితే అవి చిన్న పరీక్షలుగాని, నెల పరీక్షలుగాని, మూడు నెలల పరీక్షలుగాని, ఆరు నెలల పరీక్షలుగాని, సంవత్సరం పరీక్షలుగాని, మా తల్లిదండ్రులకు పాద నమస్కారములు చేయుట అలవాటు. ఆ సమయంలోనే మేము ఆ కార్యక్రమంకూడా నిర్వర్తించి, వారి ఆశీస్సులు పొందేవాళ్ళం. దానికి కూడా ఆయన “రామార్పణం” అంటూ ఆశీర్వదించేవారు.

మా అత్తయ్యగారి యింటికి ఆనుకొని పడమరగా ఒక మూతవేసిన ఇల్లు వుండేది. అందులో ఒక గది, పంచ మా నాయనగారి ఆధీనంలో ఆఫీసు రూముగా ఉండేది. అందులో రికార్డుచేసి తాళంవేసి వుండేది. పంచలో పడమరగా పాతకాలపు చక్కమంచము అడ్డంగాపెట్టి వుండేది. పంచ మూడువైపులా మూసివుంచి దక్షిణపు ప్రక్క ఖాళీగాను, ముందువైపునున్న పెద్ద ఖాళీస్థలం, వాకిట్లో పెద్ద వేపచెట్టు నీడనిస్తూవుండేది. అప్పటికే రైతులు వారి వారి పనులమీద అక్కడకు చేరేవారు. మా యింటిలో ముగ్గురు నౌకర్లు. ఒకరు ముదాం రుద్రవీరయ్య. యితని సెలవులో నాగయ్య అనే వ్యక్తివుండేవాడు. కోటప్ప, పుల్లయ్య వుండేవారు. వీరు ముగ్గురు ఉదయం 6 గంటలకల్లా ఇంటివద్ద హాజరుగా వుండేవారు. మాకు బర్రెపాడి ఉండేది. 1984 దాకా వుండేదనుకోండి. ముదాం ప్రతిరోజు రాగానే బర్రెతొట్టిలో నీళ్ళు తోడిపోసి, వాకిట్లో నీళ్ళుచల్లుకోవడానికి వాకిట్లోవున్న తొట్టిలో నీళ్ళుపోసేవాడు. ఆపని కాగానే ఆఫీసు రూము పంచ చిమ్మి చాపవేసి దస్త్రాలు, వ్రాతబల్ల తెచ్చి పంచలో పెట్టి వచ్చేవాడు.

నాయనగారు కాఫీ త్రాగగానే ఆఫీసులో కూర్చునేవారు. అక్కడకు వచ్చిన రైతులకు కావలసిన పనులుచేసి పెట్టేవారు. మేము యింటివద్దనే వుండేవాళ్ళం. మేము ఆయన వ్రాసుకొనేటప్పుడు అక్కడికి వెళ్ళేవాళ్ళంకాదు. కొంతకాలం తర్వాత ఆ యిల్లు అమ్మేశారు. ఆఫీసు రూము మేము వుంటున్న మా అత్తయ్యగారి యింటిలోనికి మారింది.

ఈ యిల్లు సువిశాలమైన మట్టిమిద్దె, 20 సెంట్లకుపైగా విస్తీర్ణం. దక్షిణం వాకిలి, మా అత్తయ్యగారి భర్త ఆయన సోదరుడు యిరువురు రెండు భాగములుగా చేసుకున్నారు. ఈ రెండు భాగములకు గర్భములో పెద్దతడిక క్రిందకు మీదకు అడ్డంగా వుండేది. తడికవెంబడిగా నడవ. వాకిట్లో రెండు పెద్ద అరుగులు, అరుగుల మధ్యలో నడవ. పడమర అరుగు, నడవ, తూర్పు పంచలో ఒక 5 అడుగులు. మా మేనత్తగారి భాగము. పంచ ఎదురు పడమట యిల్లు వుండేది. తూర్పు పెద్దపంద, తూర్పు చిన్న అరుగు, ఆమె తోడికోడలు భాగము వచ్చినది. మా మేనత్తగారి భాగములో మేము, రెండవ భాగములో మా నాయన పెదతల్లిగారైన లక్ష్మమ్మగారు వుండేవారు. అదిగో ఈ భాగంలోకే ఆఫీసురూము కూడా వచ్చింది. పడమట యింటిలో ఒక పెద్ద చెక్కబల్ల మంచము, ఒక బల్లపై రికార్డు దస్త్రములుగాను, విడిగాను పెట్టుకొనేవారు. ఫీల్డు పుస్తకములకు ఒక పెద్ద

పెట్టె వుండేది.  వాకిట్లో పంచలో చాపవేసుకొని వ్రాతబల్లపై నాయనగారు వ్రాసుకుంటూవుండేవారు.  నాకు ఊహ వచ్చిన తర్వాతనే ఈమార్పు జరిగింది.  అందుకనే ఆయన ఆఫీసులో కూర్చొనగానే ఏమేమి చేసేది కొంత అవగాహన ఏర్పడింది.

కాఫీ త్రాగగానే ఆయన ఆఫీసు పంచలో కూర్చుని ముందుగా కొన్ని స్తోత్రములు చదువుకొనేవారు.  వాటిల్లో (1) నరసింహకరావలంబము  (2) గోవింద దామోదర స్తోత్రము (3) దాశరథి శతకములోని కొన్ని పద్యములు  (4) భజగోవింద శ్లోకములు వగైరా.

యివి కాగానే రామకోటి లేఖన పుస్తకము తెల్లకాగితములతో కుట్టింది తీసుకొని 3 లైన్లకు తగ్గకుండా వ్రాసేవారు.  ఆ తర్వాతనే తదుపరి కార్యక్రమము మొదలయ్యేది. ఆ రోజున వచ్చిన రైతువారి పనులను పూర్తిచేసుకొంటూ వుండేవారు.

కరణీకంలో ప్రతినిత్యం ఏమి వ్రాసేవారోకాని, యితర కరణాలు మాత్రం ఒక ఆఫీసువలె ఏర్పాటుచేసుకొని ప్రతినిత్యము పనిచేయుట నేనుచూడలేదు.  ఎవరైనా ఏపనివున్నా రైతులువస్తే అంతవరకు పనిచేసిపంపి వారివారి ఇతర కార్యక్రమములో వుండేవారు.  అంటే వారికి సాగుభూములు వుండేవి.  వ్యవసాయ పనులు చూచుకొనేవారు. అంతేకాని ఆ రోజులలో ఈపనితప్ప యితర పనులేవి లేవనుకొని ఉదయం 7 గం.ల నుండి 12.30 గంటల వరకు, సాయింత్రం 3 గం.ల నుండి 4.30 గం.ల వరకు ఖచ్చితముగా ఆఫీసువలె నడిపినవారు ఎవ్వరూ లేరనే చెప్పవచ్చు.  అయినా అప్పటి పనులనుబట్టి నిత్యము రైతులకు అవసరమైనవిగా వుండేవి కూడా చాలా తక్కువ.  ఏదో విక్రయాలు, సెటిల్మెంట్లు, వీలునామాలు వ్రాసేటప్పడు నెంబర్లకొరకు వచ్చేవారు.  మరలా పరివర్తన కొరకు వచ్చేవారు. లేదా ప్రభుత్వ భూములు ఆక్రమించుకొన్నవారు బి-ఫారంపై నోటీసులు తీసుకోవడానికి లేదా పేరుచెప్పి వ్రాయించుకోవడానికి వచ్చేవారు.  ఆ రోజులలో అంటే నేను ఎరిగిన తర్వాత కరణంగారి జీతం నెలకు 33 రూపాయలుగా వుండేది.  ఒంగోలు తాలూకా ఆఫీసులో జీతాలు తెచ్చి మునసబుగారు యింటికి పంపేవారు.  అందువలన నిత్యావసరాలకు రైతులు యిచ్చే యినాంపైననే ఆధారపడి బ్రతకవలసి వచ్చేది.

నాకు ఊహ తెలిసేటప్పటికి యింటిలో మా పెద్దన్నయ్యకు వివాహం అయినది. రెండవ అన్నయ్య గారు లక్ష్మీనరసింహారావుగారు.  అద్దంకిలో ఎస్.ఎస్.ఎల్.సి. పాస్ అయి

బాపట్లలో మా మేనమామగారి వద్దవుంటూ అగ్రికల్చరల్ కాలేజీలో ఏదో ఒక చిన్న ఉద్యోగం చేస్తూవుండేవారు. మేము ఏడుగురు మగపిల్లలం, ముగ్గురు ఆడపిల్లలు. పెద్దన్నయ్య గారి తర్వాత మా అక్కయ్య రంగరాజ్యలక్ష్మి గారిని మా మేనమామ కామేశ్వరరావుగారికిచ్చి వివాహం చేశారు. ఆయన మిలటరీకివెళ్ళి 2వ ప్రపంచయుద్ధముచేసి రిటైరు అయి బాపట్ల అగ్రికల్చరల్ కాలేజిలో గుమస్తాగా చేస్తూవున్నారు. ఆయన వద్దే మా రెండో అన్నయ్యవుండేవారు. మిగిలినవారము రామయ్య పంతులుగారి బడిలోను ఆ తర్వాత హైస్కూలులోను చదువుకుంటూ వున్నాము. నాకు తెలిసిన అంటే (1958) తర్వాతనే మా చిన్నచెల్లెలు లక్ష్మిప్రసన్న జన్మించుట జరిగినది.

ఏది ఏమైనా యింటిలోని మొత్తంమీద ఉదయంపూట ఏడుగురు చద్దిఅన్నాలు తినవలసివుంది. మధ్యాహ్నం, సాయంత్రం 11 మందిమి, వీరిని పోషించుటకు చదువు చెప్పేందుకు, నాయనగారి సంపాదన చాలక మా పెద్దన్నయ్యగారు అప్పటికే గురకాయపాలెం మేనేజిమెంట్ స్కూలులో టీచర్‌గా పనిచేసేవారు. కనుక వారి సంపాదన ఆరోజుల్లో బ్రతకలేక బడిపంతులు అనేవారు. వీరిరువురి జీతాలు ఏమూలలకు సరిపోయేదికాదు. అందరు చదువుకొనేవారే. పిల్లల పలకలు, బలపములు, పుస్తకాలకు, పెన్సిళ్ళకు, రబ్బర్లకు, గుడ్డలు, పండుగలు ఇద్దరు ఆడపిల్లలకు గుడ్డలు, వచ్చిపోయే అక్కయ్య గారికి బట్టలు, వచ్చిపోయే అతిధులు వీటన్నింటికీ ఖర్చులకు ఎంతో ఇబ్బందిగానే వుండేది. పండుగలొస్తే ఆ రోజులలో మాకు తెలిసినంతవరకు పండుగలకు ప్రత్యేక ఖర్చులు తప్పేవికాదు. ఎంత పేదరికంగా వున్నా ఎంతచెట్టుకు అంతగాలి చందాన వీరందరి తలంట్లకే సరిపోతుంది, అయితే మా అన్నయ్య, అమ్మ యిద్దరు ఈ సంసార భారాన్ని మోయడంలో ప్రత్యేకపాత్రను పోషించారనడంలో సందేహంలేదు.

ప్రతిరోజు మధ్యాహ్నం, సాయంత్రం భోజనానికి ఎవరో ఒకరుమీద ఆధారపడే రోజులే ఎక్కువగా వుండేవి. రైతులు పంటకాలం వచ్చినతర్వాత కొన్నాళ్ళు వాళ్ళు యిచ్చే దాన్యం, సజ్జలు, జొన్నలు, వరిగలుతో మధ్యాహ్న భోజనానికి కొంత వెసలుబాటు కలిగినా రాత్రిపూజ మాత్రం సాధ్యం అయినంతవరకు వరి అన్నమే వండేవారు. ఎవరు ఏదియిస్తే ఆ ధాన్యాన్ని వాడుకోవడం వలన కొన్నినాళ్ళు జరిగినా అలాంటి రోజులు తక్కువగానే వుండేవి.

ఆరోజులలో పంటలు కూడా వర్షాధారము. పండిన సంవత్సరం కూడా పనులు లేకుండా ఎవరినీ అడగడం మా నాయన గారికి ఇష్టం వుండేదికాదు. తప్పనిసరి అయిన స్థితిలో అంటే మరీ వానాకాలంలో రైతులకు కరణంగారితో పనులు వుండేవికాదు. అప్పుడే పొయ్యిలో పిల్లిలేవడం కష్టమే. ఆ పరిస్థితులలో అడగటానికి యిద్దరు, ముగ్గురు రైతులను కేటాయించేవారు. నాయనగారు చెప్తేనే ఎవరి యింటికి అయినా వెళ్ళి తీసుకొనిరావాలి. అది ఆ యిబ్బంది రోజులలో తప్పనిసరి అయితే ఆ రైతువద్దకు కోటప్పను పంపేవారు. ఆ పూటకు ఎట్టాగో గడుస్తూవుండేది.

భగవంతుడు ఆయనకు బహుసంతానము, తక్కువ జీతము యిచ్చి అననుకూల పరిస్థితి యిచ్చినా అనుకూలవతి అయిన భార్యను యిచ్చాడు. ఎందరిలోనో ఒక్కడుగా లెక్కించతగ్గ వ్యక్తిత్వముగల పెద్ద కుమారుని యిచ్చాడు. సహనము, ఓర్పు, అణకువ, ఆప్యాయత, పోగుచేసి పెద్దకోడలును యిచ్చాడు. ఈ పరిస్థితులలో ఆయన తన గుండె నిబ్బరంతో ధ్యానంచేసుకుంటూ అంతా రామమయంగా చూస్తూ తన ప్రస్థానాన్ని కొనసాగించారు. హైస్కూలు పిల్లలు ఒంటిగంటకు యింటికి వచ్చేవారము. మాతో కలిసి ఆయన భోజనానికి వచ్చేవారు. మధ్యాహ్నం 1.30 గం.లకు భోజనంకాగానే ఆయన కొంతసేపు విశ్రాంతి తీసుకొనేవారు. పిల్లలం స్కూలుకు వెళ్ళేవాళ్ళం. ఆయన తన విశ్రాంతి కాగానే మరలా ఆఫీసులో కొంతసేపు వ్రాసుకొనేవారు. సాధారణంగా రైతులు ఆ సమయంలో రారు. ఎవరో ఒకరు తప్ప.

సాయంత్రం 4 గంటలకల్లా తిరిగి నౌకర్లు వచ్చేవారు. కోటప్పను వెంటబెట్టుకొని బజారుకు వెళ్ళేవారు. సాయంత్రానికి గాను ఉభయం కోసం మళ్ళా ప్రయత్నం. అక్కడ కొత్తమాను సుబ్బారావు గారి గుడ్డలకొట్టువద్ద గుంజకు ఆనుకొని కూర్చుని వాళ్ళు యిచ్చిన పేపరు చదువుకుంటూ వుండేవారు. ప్రక్కనే మిషన్లచప్పుడు. బజారంతా ఏదోకొంత సందడిగా వుండేది. ఆ సమయంలో జార్లపాలెం, చెరువుకొమ్ముపాలెం, బొమ్మనంపాడు, జాగర్లమూడివారిపాలెం గ్రామాల నుండి రైతులు బజారు పనులకు కొట్లవద్దకు వచ్చి వారికి కావలసిన సామానులు కొనుగోలు చేస్తూవుండేవారు. కోటప్ప ఆ సమయంలో అటుఇటు తిరుగుతూ గమనిస్తూ వుంటాడు. ఆ వచ్చినవారిలో తనకు ఫరవాలేదు అనుకొన్నవారు వచ్చినపుడు నాయనగారి వద్దకు వచ్చి అయ్యా ఫలానావారు సరుకులకు వచ్చారు పిలిచేదా?

అనేవాడు. దానికి ఆయన ఆలోచించి ఆ పేరుగల వ్యక్తియొక్క వ్యక్తిత్వమునుబట్టి సరే అనో, కాదు అనో తలూపేవారు. కాదు అంటే మరలా వేట ప్రారంభం. సరే అంటే ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళి అయ్యగారు రమ్మన్నారు అని చెప్తే ఆయన నాన్నగారి వద్దకు వచ్చి నమస్కారంచేసి నిలబడేవాడు. నాయనగారు ఆ వ్యక్తిని చూచి "ఈపూట ఉభయం నీదోయి" అని కాని, "పొయ్యిలో పిల్లిలేవలేదు" అనికాని అనేవారు. ఆ వచ్చిన రైతు సరే అంటూ కొట్లోచెప్పి ఇప్పిస్తాననేవారు. లేదా డబ్బులుంటే జేబులోనుంచి తీసి రెండుగాని మూడుగాని రూపాయలు యిచ్చేవాడు. అప్పటికి సమయం దాటుతుంది. అప్పటికి కావలసిన బియ్యం, చింతపండు, వగైరా తీసుకొని కోటప్ప యింటికి వెళ్ళేవాడు.

నాయనగారు అక్కడినుండి బయలుదేరి మా గ్రామంలో ప్రసిద్ధమైన ప్రాచీన దేవాలయమైన రామలింగేశ్వరస్వామి వారి గుడివద్దకు చేరేవాడు.

ఈ గుడి విషయం ఇక్కడ ప్రస్తావన చేయుట ఎంతో అవసరం. నాయనగారు కరణీకం చేపట్టిన క్రొత్తల్లో తాలూకా ఆఫీసులో శ్రీ వారణాశి సీతారామయ్యగారు అని ఒక కాపీయిస్టు వుండేవారు. ఆయన చాలా పేదవాడు. ఇద్దరు సంతానము. ఆ రోజులలో ఆయనకు జీతంలేదు. ఏదోఒక నకలు వ్రాస్తే వాటిపై కొంత ఆదాయం యిస్తూవుండేవారు. ఆయనకు మా నాయనగారికి స్నేహం కుదిరింది. యిరువురు ప్రతిరోజు తాలూకా ఆఫీసు పనికాగానే ఒకరి యిబ్బందులు ఒకరికి చెప్పకునేవారు. శివాలయానికి వెళ్ళేవారు. ఆ పోయేత్రోవలో నాగజెముడు గుట్టలుతప్ప ఏమి వుండేవికావు. తాలూకా ఆఫీసు దక్షిణం త్రోవనుండి వెళ్తూవుంటే పోలేరమ్మ దేవాలయం కాస్త ముందుకుసాగి బాగా వెనక్కువెళ్తే కోటకట్ట ఆనుకొని శివాలయము. ఆ కోట, రెడ్డిరాజులకాలంనాటిదని ప్రతీతి. సన్నని త్రోవగుండా వెళ్ళి వీరిరువురూ దేవాలయం బయట అరుగుమీద కూర్చొని కాసేపు మాట్లాడుకోనిదే వెళ్ళేవారుకాదు. ఆవిధంగా వారు వరుసగా 4 రోజులు వెళ్ళారట. కాని సాయంసమయంలో గుడిలో పెట్టవలసిన సంధ్యాదీపం పెట్టడానికి అర్చకులు రాలేదు. వీరిరువురు ఆ విషయమై ఆరోజు తర్కించుకొన్నారు. ఆ తర్వాతరోజు నాయనగారు అప్పటిలో అర్చకులుగావున్న నాదెండ్ల రాఘవయ్యగారికి కబురుచేసి, పిలిపించి విషయం అడిగారు. ఆయన అయ్యా! సాయంత్రంపూట యిక్కడకు రావాలంటే పాములు తిరుగుతూ వుంటాయి. అందుకని మధ్యాహ్నమే దీపారాధన చేసి వెళ్తున్నాను అని చెప్పారట. వెంటనే నాయనగారు

విచారించి రాఘవయ్యగారు మేము యిరువురం ప్రతిరోజు సాయంత్రం ఇక్కడకు వస్తాము. మీకు తోడుగావుంటాము. భయంలేదు. సంధ్యాదీపం వెలిగించండి అని చెప్పారట. ఆరోజునుండి స్వామివారికి సంధ్యాదీపం వెలిగించడం జరిగింది. నాయనగారు ఈపనిచేసిన తర్వాత అర్చకులు చేసే అర్చన పూర్తయ్యేవరకు వీరు యిరువురు కూర్చొని హరేరామ భజన చేసుకొని అర్చన కాగానే మంత్రపుష్పం చదివి యింటికి చేరేవారు. ఈ విషయాన్ని నాయనగారు కొందరి వైశ్యులతో చెప్పారు. గుడిపాడుపడితే ఊరికి అరిష్టం. కాబట్టి ఏదోఒకటిచేసి నిత్యార్చన జరిగేటట్లు చూడమన్నారు. దానికిగాను నేను ఆదివారం కొబ్బరికాయ, బెల్లం, సాంబ్రాణికడ్డీల, కర్పూరపు పొట్లం, అణాదక్షిణం యిస్తాను. మీలో ఎవరైనా రోజువారీగా రోజువారీగా వారంరోజులు ఏర్పాటుచేయమని చెప్పేరట. యింకేముంది, ఒక మంచి మనస్సు సంకల్పం దివ్యంగా నెరవేరింది. కొన్ని రోజుల తేడాలోనే మిగిలిన రోజులకు కూడా ఉభయాలు కుదిరినాయి. కూర్మాల వీరయ్య, మిన్నెకంటి కోటేశ్వరరావు, సీతారామయ్యగారు వగైరాలు. స్వామికి నిత్యము అర్చన కార్యక్రమం. ఉభయ దాతంలదరూ ప్రతిరోజు రావడం ఒకరికొకరు కొంతసేపు వేచియుండి అందరుచేరి కాసేపు భగవన్నామ సంకీర్తన చేసేవారు. ఒక గంటకుపైగా కాలక్షేపం దివ్యంగా వుండేది. అర్చన కాగానే మంత్రపుష్పం చదవడం, తీర్థం స్వీకరించడం, యింటికి వెళ్ళడం. ఆరోజునుండి యిది నిత్యకృత్యమైపోయింది. ఈ దినచర్యకూడా ఏనాడు తప్పలేదు. ఎండాకాలం సరేసరి.. వర్షాకాలంలో అక్కడకు పోయిరావడం నేను ఎరిగిన తర్వాత గూడ కొంచెం కష్టంగా వుండేది. ఈ గుడి దాదాపు ఊరికి చివరవుండేది. నిర్జన ప్రదేశం చుట్టూ నాగజెముడు దాటివస్తే కంలబందకంచె వేసిన చేను చక్కగా త్రోవ పాముమాదిరిగా వుండేది. మామూలుగా అటువైపుదారిలో ఎవ్వరూ వెళ్ళేవారుకాదు. మిగిలినవారు అందరికీ ఒక త్రోవ. వారికి ఆ నాగజెముడు దాటగానే ఒక ఫర్లాంగులోగానే యిండ్లు కనపడేవి. అందరు ఒకరికొకరు తోడుగా వెళ్ళేవారు. నాయనగారు ఒక్కరే ఇటు రావలసివచ్చేది. యింటిలో మా అమ్మ, అన్నయ్య యిరువురు వానాకాలం ఎందుకు యిబ్బంది కదా. ఏమీ కనబడదు. చీకటిరోజులు, యింక సరేసరి. కీచురాళ్ళు ధ్వనితప్ప తోడేమి వుండదు అని అడిగారు. అయినాసరే ఆయన "వాడే వున్నాడు" అని ఊరుకునేవారు. తర్వాత మాటలాడటానికి అవకాశం యిచ్చేవారు. ఇంటికి తీసుకొచ్చిన ఆ ప్రసాదం అందరికి పంచిపెట్టి

ఆనందించేవారు.  అంతేకాని ఆయన దినచర్య జీవితాంతం మారలేదు.

ఆయన ఇంటికొచ్చేసరికి పిల్లలు అందరూ భోజనాలు చేసేవారు. చదువుకొంటూ వుండేవాళ్లం.  ఆయన రాగానే ప్రసాదం తీసుకొని కొంతసేపటికే నిద్రపోయేవాళ్లు.  7.30 గంటలు దాటూతూ వుండేది.

అమ్మగారు, వదిన అన్నయ్య నాన్న కొరకు చూస్తూవుండేవారు. ఆయన బట్టలు మార్చుకొని కొల్లాయిగుడ్డ కట్టుకొని కొంచెంసేపు ఆరుబయట తన మంచంపై చుట్టి వేఇన పరుపుపై తలపెట్టుకొని విశ్రాంతి తీసుకొనేవారు.  ఆ సమయము షుమారుగా అరగంట పడుతుంది.  ఆ తర్వాత ఆయన భోజనానికి లేచేవారు.  విభూతి ధరించేవారు.  భోజనం కాగానే మరలా ధ్యానం చేసుకుంటూ వాకిట్లోనున్న అరుగుపై కూర్చొని గోవింద దామోదర స్తోత్రము, రామరక్షా స్తోత్రము కూజంతం రామరామేతి ఎవ్వనిచే జనించు, చేసితి ఘోరకృత్యములు పద్యములు యింకా ఏవో చదువుకొనేవారు.  ఈలోగా ఆడవాళ్లు భోజనాలు ముగించుకొని వచ్చేవారు.  ఆయన మేము పండుకొన్న అరుగువద్దకు వచ్చి బ్యాటరీలైటువేసి, ఒకొక్కరినీ చూచుకొని వెళ్లి పడుకునేవారు.  ఒకొక్కసారి లైటు బాగా కనబడక రాముడు ఎక్కడ?  వెంకాయెక్కడా? అని మా అమ్మగారిని అడిగి తెలుసుకొనేవారు.  ఆ చూపులోనే ప్రేమతోపాటు అద్భుతమైన శక్తులన్నీ మాకు పంచేవారు కాబోలు.  తర్వాత పడక.  తిరిగి బ్రాహ్మీముహూర్తముతో దినచర్య ప్రారంభం.

అయితే ఈయనను గురించి ఏమి చెప్పదలచుకొని యింత వ్రాసారనవచ్చు. చాలామందిలాగానే వుంది కదా వీరి దినచర్య అనవచ్చు.  కాని యిక్కడ తెలుసుకోదగినవి, తెలుసుకొని ఆచరించదగిన ముఖ్యవిషయాలున్నాయి.  కనుకనే యిది వ్రాయవలసివచ్చింది. మనం ఈ రోజులలో ఎంతో శ్రమ, జ్ఞానము పొందిన వారినుండి తెలుసుకోదగినవి. ఆచరించదగినవి.  మా నాయనగారు సాధారణముగానే ఆచరించి చూపించారు.

సంసారములో గృహస్థాశ్రమంలో ఋషులు ఏర్పరచిన ధర్మసూక్ష్మములు ఆచరించి చూపించి ధన్యతగొన్నారు.

ఆ రోజులలో జమాబంది అనునది కరణాలకు సంవత్సరం పరీక్షలులాంటివి. ప్రతి సంవత్సరం శిస్తు నిర్ణయం, వసూళ్లు.  బాకీ మొదలగునవి 24 లెక్కలు వుండేవి. వీటినన్నింటిని క్షుణ్ణంగా వారే సంబంధిత తాలూకా ఆఫీసులో సిబ్బందతో తనిఖీ నిర్వహిస్తారు.

తర్వాత జమాబంది అధికారిగారు, వారి సిబ్బందితో తిరిగి తనిఖీలు రెండు దశలలో నిర్వర్తించి, ప్రజాసమక్షంలో వాటిని ఆమోదించేవారు.

దీనికై ప్రతి గ్రామ కరణం, మున్సబు వారి వారి లెక్కలను శ్రద్ధతో అంకితభావంతో చేయవలసివుంటుంది. జమాబంది సిబ్బంది తప్పగానున్నదని వేలెత్తి చూపితే నామోషీగా ఫీలయ్యేవారు. అందుకని ఒకటికి రెండుసార్లు యింటివద్దనే స్వయంగా తనిఖీచేసుకొని జమాబందికి సిద్ధమయ్యేవారు.

నాయనగారు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధను కనపరచేవారు. ఆ రోజులలో రూపాయలు, అణాలు, పైసలు వుండేవి. తనిఖీలో తప్పపట్టకుండా వుండుటకై నాయనగారు తను వ్రాసిన లెక్కలను సరిచూచుటకై మా 3వ అన్నయ్య వెంకటేశ్వరరావు గారిని కొంతకాలం ఆయన చదువులకై వెళ్ళగానే 4వ అన్నయ్య రామచంద్రరావు గారిని వినియోగించేవారు.

సోదరి యింటనుండుటకు తనకు యిష్టం లేకపోయిననూ వుండి, కొంతకాలం తర్వాత గ్రామస్తుల సహకారంతో సొంత పూరియింటిని మట్టిగోడలతో నిర్మించుకొన్నారు. దానిలోనే చాలా కాలం వున్న తర్వాత అది శిథిలమైపోగా బాగుచేయించుకొనుటకు సైతము ఆర్థికస్తోమతలేక వదిలి వేయవలసి వచ్చినది. నాయనమ్మతో ఏడుగురు వారికి సంబంధించిన సంతానములో కూడా వీరు తన స్వంత అక్కాచెల్లెళ్ళు, సోదరులవలె ఆదరించెడివారు.

వారికి సర్వజగత్తు రామమయముగా తోచేది. కావున ఎల్లప్పుడు “రామాయణం” చదువుచుండెడివాడు. వారి ప్రవర్తన వలన, వారి నియంత్రణ వలన వారి పేదతనమును మించి అందరిచే గౌరవింపబడేవారు. అధికారులు, అనధికారులు, రైతాంగము, సామాన్య జనము, యితర నమ్మజాతులవారు ఎవరైనాసరే ఉత్తర అద్దంకి కరణం అంటే రెండు చేతుల పైకెత్తి ఆయన “మహానుభావుడు”, “ఆయన ధర్మరాజు”, “చాలా మంచివాడు”, “దేవుడయ్య”, అట్లాంటి కరణం యిలలోలేడు”, “అబ్బో ఆయననెక్కడ ధర్మరాజు కదంటయ్య ఎన్ని దీపాలు పెట్టాడో”.

ఇట్లాంటి వాక్యములుతప్ప ఏ చిన్న విమర్శ చేయు పదము ఎవ్వరినోటినుండి వినజాలము. ఒక వ్యక్తి అందరి మన్ననలు పొందుట కలియుగములో అసాధ్యము. కాని అది సుసాధ్యము అని, తన జీవనశైలిలో నిరూపించిన మహామనిషి శ్రీ వెంకట నరసింహంగారు.

ఈనాడు కూడా ఆయనను ఎరిగిన జనులు రైతు ఎవరైనా తటస్థపడితే ఆయననుగూర్చి ప్రస్తావన రాగానే రెండు చేతులు జోడించుట మనం గమనించవచ్చును.

ఆయన పరమజ్ఞానమునుపొంది భగవద్గీతాచార్యుడు చెప్పిన విధముగా అన్ని జీవులలో తన అరాధ్యదైవమైన రాముని దర్శించు భాగ్యమునకు నోచుకొన్న విశిష్టజ్ఞాని, పండితుడు. అనగా పండితాస్సమదర్శనః అనికదా! గీతా వాక్యము.

ఎవరైనా యింటికి వచ్చిగాని, ఎదురైనప్పుడు గాని వారు నిలబడి కరణంగారిని నమస్కరించినచో రెండోచేయి జోడించి రామార్పణం అని చెప్పెడివారు. అధికారులకు పమ్కరించినపుడు కూడా చిన్నగా రామార్పణం అని అనెడివారు. ఆ మహానుభావుడికి కులమత విచక్షణ వున్నట్లు తోచదు.

ఆ రోజులలో బ్రాహ్మణ కుటుంబములో మడి, ఆచారము ఎంతో నిష్ఠవుండుట అందరు ఎరిగిన సత్యము. ఈ విధముగానే దేవార్చనవుండేది. వీరు తన కరణీకపు పుస్తకముల దొంతరలను అదస్త్రములుగా గుడ్డలతో కట్టించివుంచేవారు.

ప్రతిరోజు తనకు భగవంతుడు ప్రసాదించిన ఈ కరణీకం వృత్తిని భగవదాజ్ఞగా, భగవత్సేవగా స్వీకరించి దానితో మమేకమై వేరేధ్యానములేక వుండెడివారు. అనగా ఒక పద్ధతిగా తనదైనశైలిలో అలవాటుగా చేసికొన్నారు. ప్రతిరోజు బ్రాహ్మముహూర్తమున లేచి నదీస్నానమునకు వెళ్ళి, సంధ్యావందనాది కృత్యములు పూర్తిచేసుకొని బిందెతో నీళ్ళు తెచ్చుకొని యింటియందుంచి విభూదిరేఖలు ధరించి, రోజువారి వస్త్రములు దాల్చి కాఫీ పుచ్చుకొనెడివారు.

ఈలోగా ముదాము యింటికివచ్చి 7 గంటలలోగా ఆఫీసుగావున్న పంచను శుభ్రపరచి, చాపవేసి ఆఫీసురూం నుండి వ్రాతబల్ల, రూళ్ళకర్ర, పెన్నుల స్టాండు, పారాయణ కట్టడపులు, కట్టదస్త్రములు, మరియొకదస్త్రములను అక్కడ ఏర్పాటుచేసి యుండెడివాడు. వీరు కాఫీ త్రాగగానే ఆఫీసురూంలో కూర్చొని యింకా కావలసిన పుస్తకాలను గూర్చి ముదాముకు చెప్పి పంచలోనికి వచ్చెడివారు. అప్పటికే ఎవరైనా వచ్చిన రైతులు లేచి రెండు చేతులతో దణ్ణముపెట్టగా ప్రతివారికి నమస్కరించుచూ “రామార్పణం” అనికాని, “భగవతార్పణం” అనిగాని అన్ని నమస్కారములకు తెలిపి మౌనముద్రవేసి కూర్చుండి “శ్రీరామ” అను తారకమంత్రమును 3 లైన్లకు తగ్గకుండా పుస్తకమలో వ్రాసి తర్వాత దోరదశతకము,

పరసింహ కళావలంబము పఠించి, ఆ తర్వాత తన నిత్యకృత్యమైన కార్యాలయపు పనికి పూనుకొనేవారు. ఆ సమయంలో అచ్చటికి వచ్చినవారు సైతము ఈ వ్రాయుట, పఠనము తిలకించి, ఆలకించి పునీతులు అయ్యేడివారు. యింతవరకు జరిగిన ఈ విధానములో ఒక్కరోజు కూడా (గ్రామాంతకము వెళ్ళినపుడు తప్ప) తన జీవితములో నాగా లేకుండా చివరిరోజు వరకు ఒకే రకముగా నిర్వర్తించిన సఫలీకృతుడు ఆయన. ఆరోజు వచ్చిన వారికి వారి వారి కార్యక్రమములు పూర్తిచేసి పెట్టెడివాడు. కాని నాకు యిది కావలయును అని వారి నోటిమీదుగా అడిగేవారుకాదు. కాని ఇచ్చే వారందరికి ఈ విషయము పూర్తిగా అవగాహన ఉండుటవలన సామాన్యముగా వారు తమకుతోచిన దానికి అక్కడ దుంచెడివారు. కాని అది వారు అతిప్రేమతో అత్యంత భయభక్తులతో వంగి వ్రాతబల్లపై వుంచివెల్లెడివారు.

ఆరోజులలో డబ్బు అనునది ప్రాముఖ్యము కలిగినది. కాని అదే ముఖ్య అవసరముకాదు. కరణము-రైతు బాంధవ్యమునకు మించినదికాదు. డబ్బు కొరకై ఎప్పడు ఏపని అయినా ఆయన చేయలేదు. తన విధ్యుక్త ధర్మమును భగవదాజ్ఞగా నిర్వర్తించి వచ్చిన దానితో సంతృప్తిపొంది అది భగవంతుని యిల్లుగా, మీ యింటిలోని వారిని సేవించుట భాగవతసేవగా తన విద్యుక్తధర్మములను నెరవేర్చినవారు శ్రీ వెంకట నరసింహం గారు.

ఒకొక్కరోజు కార్యాలయపు పనిలేకుండా ఖరీఫ్, రబి గింజలతో సాగుబడికి వెళ్ళేవారు. కాఫీ త్రాగిన తర్వాత ఆరోజు కూడా తారకమంత్ర రచన, పుస్తకపఠనము పూర్తిచేసుకొని బయలుదేరెడివారు. అడంగలు, 'డిస్కేచ్, ముగ్గురు నౌకర్లు కలిసివెళ్ళి సాగుబడి వ్రాసుకొని వచ్చెడివారు. ప్రతిఫలమును క్షుణ్ణంగా పరిశీలించి గాని సాగువ్రాసెడివారు కాదు. గట్టు గట్టు తిరిగి, పంటలనుచూచి అవసరమైతే కొలతకర్రతో కొలతలు వేయించి పంట విస్తీర్ణమునుతేల్చి సాగుబడి వ్రాసేవారు. ఈ విషయమై వారి సహచరులలో ఒకమాట వాడుకలో వుండేది. ఆయనది మరీ చాదస్తుము కొలతవేసి వ్రాయకపోతే ఏం అని అనుకొనుచుండెడివారు. వీరితో అత్యంత సహచరులైన కొండమంజులూరు కరణంగారు ఒరే నరసింహం కొలతవేసి వ్రాస్తావట సాగుబడి. అట్లా ఎందుకూ అనేవాడు. ఆయన దానికి ప్రతిగా తన బోసినోటితో నవ్వి అదొక చాదస్తంలే

అని వూరకుండెడివారు. సాగుబడి సమయంలో పిల్లలకు సెలవులున్నచో వారిలో ఎవరైనా వస్తామని మాఅమ్మగారి చేత అడిగిస్తే తలవూపి సరే అనేవారు. వారి వెంటవెళ్ళినపుడు పొలములో దోసకాయలు, వేరుశనగచేలు కనబడినపుడు మేము కోయుటకు ప్రయత్నించెడివారముకాము. ఎందుకంటే అది వారికి యిష్టముండదు. కోటప్ప అనే నౌకరుండేవాడు. అతన్ని అడిగేవారము. అతను కోయడానికి చేలోకివెళ్ళేవాడు. నాన్నగారు వారించి చేలో మనిషిలేనప్పడు కోస్తే దొంగతనము క్రిందలెక్క. కావున మనిషివున్న చేలో నుండి అడిగి తీసుకొనవలెనని వారించేవారు.

ఆ విధముగానే చేలో రైతు వున్నపుడు కోటప్ప వాళ్ళను అడిగి వేరుశనగ కాయలు, దోసకాయలు, పెసరకాయలు కోసియిచ్చెడివారు. మేము వాటిని తీసుకొని యింటికి తెచ్చేవారము. కాని ఆయన దానికికూడ అయిష్టముగా నుండెడివారు. ఆ విధముగా ఆయన పరధనమును పాపముగానెంచి ఉచితముగా ఎవ్వరివద్దనుండి తీసుకొనుటకు యిష్టపడేవారుకాదు. త్రోవలో డబ్బులు చిక్కితే అవి సాయంత్రానికి గుళ్ళోవేయటంగాని, పురోహితులు సద్మనాభయ్య గారికిగాని యిచ్చాము. సాగుబడి ముగించుకొని యింటికి వచ్చిన తర్వాత ఆ వస్త్రాలను విప్పి దావళివేసుకొని కాళ్ళు కడుక్కొని మధ్యాహ్నకమును చేసుకొనుటకు ఉపక్రమించేడివారు. గాయత్రి కాగానే వారికి కీ.శే. రావుబహదూర్ అద్దంకి వెంకట్రామయ్య, రిటైర్డ్ జిల్లాజడ్జి గారు బహూకరించిన త్రిమతాచార్యుల వ్యాఖ్యాన సమితముగా నున్న భగవద్గీతపారాయణను చేసెడివారు. ప్రతిరోజు ఒక అధ్యాయమునకు తగ్గకుండా ఎన్నికార్యములు అడ్డువచ్చినన, ఎంత ఆలస్యముగా యింటికి వచ్చినను చదువుకొనెడివారు. ఆ తర్వాత మధ్యాహ్న భోజనము. తన పారాయణం కాగానే వారికి వెలుపలికివచ్చి ఏదో ఆలకించెడివారు. చాలా కాలము ఈ విషయము తెలియలేదు. మా అమ్మగారు భోజనం వడ్డించి ఎదరుచూచు చుండగా వీరు వాకిటి నుండి లోనికి వచ్చెడివారుకాదు. ఈరోజు కొంచెం ముందుగా వచ్చినానుకదా? పెందలకాడే భజనము చేయుదురని తలచిన యిక్కడవున్నా రెండుకు అని అడిగితే వస్తున్నా అనేవారు. కాని తన సమయము పూర్తికానిదే వచ్చేవారుకాదు.

దానికి రెండు కారణములన్నవని దరిమిలా మేము మా తల్లిగారి మాటలనుండి గ్రహించగల్గినాము. అదే బజారులో చివరిగా పాలపర్తివారి యిల్లు కలదు.

పాలపర్తి నరసింహదాసుగారు అనువారు మహాభక్తులైయుండిరి. తక్కెళ్ళపాడు అయ్యవార్ల వారి వద్ద సమాశ్రయణము పొంది శింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి అనుగ్రహంచే బీజాక్షరములు పొంది, కైవల్యమును పొందియున్నారు. వారి ఆరాధన విగ్రహములకుగాను ప్రతినిత్యము మధ్యాహ్నంనందు ఆదరింపు సమయములో గంటానాదము చేయుచుండెడివారు. నరసింహదాసుగారి మరణాంతరము వారి కుమారుడు శ్రీమన్నారాయణ అనువారు ఈ కార్యక్రమము నిర్వర్తించుచున్నారు. వారికి ఆ కాలములో జరుగుబాటు తక్కువగావుండేది. వారుకూడ గ్రామస్థుల దయపై ఆధారపడి స్వామి కైంకర్యముచేయుచుండెడివారు. మా నాన్నగారు వాకిట ఆ గంటానాదము కొరకు నిరీక్షించుచుండేవారు కాబోలు. మాకు చాలాకాలము వరకు తెలియదు. ఒకరోజు గంటానాదము వినబడలేదు. సమయముదాటుచున్నది. కంచములో పెట్టిన అన్నము చల్లారుచున్నదని మా అమ్మగారు వాపోవుచున్నారు. మేమందరము కంచాలవైపు చూచుచూ కూర్చున్నాము. అప్పడు మా నాన్నగారు మా అన్నయ్యగారిని పిలిచి సుబ్బారావు ఈరోజు పాలపర్తి వారింటి గంట వినబడలేదే? స్వామి కైంకర్యము జరిగినదో లేదో కదా? అని తన సందేహము వెళ్ళబెట్టినారు. అంతట మా అన్నయ్యకు మాకు విషయము అర్థమైనది. ఈయన ఆ గంటానాదము వినబడగానే వాకిటనుండి యింటిలోపలికి నామస్మరణం చేయుచూ వెనుతిరిగేవారు. లేదా వాకిలివద్ద నిలబడి హరేరామ సంకీర్తన చేస్తూవుండేవారు. అప్పడు అన్నయ్య పైగుడ్డవేసుకొని వెళ్ళి శ్రీమన్నారాయణగారిని విచారణచేసి వారి ఆరగింపు అయినదిని ఏవో కారణము వలన గంటకొట్టలేదని తెలుసుకొనివచ్చి చెప్పిన పిదప నాన్నగారు వచ్చి కంచము ముందు కూర్చున్నారు. ఆరోజు నుండి ఆ గంటానాదము గురించి తెలిసినది.

ఒకొక్కసారి గంటానాదము అయిన తర్వాత కూడ వాకిటనుండే నిలబడి కొంచెంసేపు వుండివచ్చి భోజనము చేసెడివారు. దానికి కారణము మనము శాస్త్రములు వెదకవలసినదే. "అతిథి నిమిత్తం ఆవుపాలు పెతుకుతున్నంతసేపు గృహస్తువు వెదుకవలెనని ధర్మశాస్త్రముకదా? ఆ యెరికచొప్పన వారు అంతసేపు ఖచ్చితముగా నిలబడియుండి వారు నామముచేయుచుండెడివారు. ఆ సమయంలో ఎవరికైనా అతిథి వచ్చిన ఆయన ఎంతో సంతోషించేవారు. యింట్లో ఆడవారు కొంచెం యిబ్బందిపడేవారు. అయినాసరే ముందు అతిథికి వడ్డించి, ఆ తర్వాత మరల వంటచేసుకొనేవారు.

---